# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website2:www.netinijam.com2 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ ఆదివారం 12-5-2024 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93· Postal No. HQ/SD/258/2024-2026 సంపుటి :30 సంచిక:217 పేజీలు:6 వెల: రూ.1/-


## అఫ్గానిస్థాన్‌లో భారీ వర్షాలు బీభత్సం 200 మంది మృతి

కాబూల్ మే 11 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: అఫ్గానిస్థాన్ లో భారీ వర్షాలు బీభత్సం సృష్టిస్తున్నాయి. దాంతో దిగువ ప్రాంతాలకు వరద నీరు పోటెత్తింది. బఘ్లాన్ ప్రావిన్స్‌లో దాదాపు 200 మంది ప్రాణాలు కోల్పోయారని ఐరాస వెల్లడించింది. ఈ విపత్తుతో పలు గృహాలు ధ్వంసమయ్యాయని తెలిపింది. దాంతో భారీ ఆస్తి నష్టం సంభవించింది. ఈ వర్షాలకు ఉత్తర అఫ్గానిస్థాన్ తీవ్రంగా ప్రభావితమైందని తాలిబన్ ప్రభుత్వ ప్రతినిధి తెలిపారు. శుక్రవారం రాత్రి వరకు 62 మంది మృతి చెందారని తెలిపారు. బదాక్షన్, బఘ్లాన్, ఘోర్, హెరాత్ ప్రావిన్సులు దారుణంగా దెబ్బతిన్నాయి. ప్రస్తుతం సహాయ చర్యలు కొనసాగుతున్నాయి.

### చురక

కష్టాలు కడగండ్లను
కడదేర్చే కార్యదీక్ష
ఎవరికుందో లేదో తేల్చే
ఎన్నికలే ఒక పరీక్ష

ఒక్కరోజే భాగోతం
ఓటు తీర్పే ఐదేళ్లు
పాత్ర సరిగ లేకుంటే
ప్రతీ రోజు కన్నీళ్లు



-వేల్పుల నారాయణ

# 25 ఏళ్లలో మెదక్ అభివృద్ధి సున్నా.. సీఎం రేవంత్

**-ఈ ఘనత బీజేపీ, బీఆర్ఎస్ దే**
**-అభివృద్ధి కావాలంటే కాంగ్రెస్ కు పట్టం కట్టండి**
**-బీజేపీ ది విభజించు, పాలించు సిద్ధాంతం**
**-ముస్లీంలు, హిందువులు తన్నుకునేలా కమలం వ్యూహం**
**-అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించిన రేవంత్**
**-చివరి రోజును పటాన్ చెరులో ముఖ్యమంత్రి రోడ్ షో**

హైదరాబాద్, మే 11 :25 ఏళ్లుగా మెదక్ స్థానంలో బీఆర్ఎస్ లేదా బీజేపీ ఎంపీలే ఉన్నారని, కానీ ఈ రెండు పార్టీలు ఈ ప్రాంతానికి అన్యాయం చేశాయని ధ్వజమెత్తారు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మెదక్ కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధుకు మద్దతుగా పటాన్ చెరులో నిర్వహించిన కార్నర్ షోలో రేవంత్ రెడ్డి మాట్లాడుతూ పటాన్ చెరు మినీ ఇండియా లాంటిదని దేశంలోని అన్ని ప్రాంతాల వారు ఇక్కడ ప్రశాంతంగా నివసిస్తున్నారన్నారు.. ఈ ప్రాంతంలో



మౌళిక సదుపాయాలు సక్రమంగా లేవని ఈ ప్రాంతానికి గోదావరి జలాలు రావాలన్నా, మెట్రో రైలు రావాలన్నా, మాదిగల వర్గీకరణ కేసు గెలవాలన్నా, ముదిరాజులను బీసీ–డీ గ్రూప్ నుంచి బీసీ–ఏ గ్రూప్ లోకి మారాలన్నా ఇక్కడ నీలం మధు గెలిపించాలని కోరారు.

### విభజించు పాలించు.. ఇదే బీజేపీ విధానం..

మతాలు, భాషలు, ప్రాంతాల మధ్య చిచ్చు పెట్టి మనుషులు కత్తులతో పొడుచుకునేలా బీజేపీ కుట్రలు చేస్తోందని, హిందూ ముస్లింలు పొడుచుకుని రక్తం పారుతుంటే అందులో నుంచి ఆ పార్టీ సీట్లు గెలుచుకోవాలని ప్రయత్నిస్తోందని ఆరోపించారు. గతంలో అభివృద్ధి, సంక్షేమం ప్రాతిపదికను ఎన్నికలు జరిగేవని, కానీ తొలిసారి ఇప్పుడు రాజ్యాంగాన్ని మార్చుతాం, రిజర్వేషన్లు తొలగిస్తామంటున్నారని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు రేవంత్ రెడ్డి.

### రోజు కొట్టుకుంటే పెట్టుబడులు ఎలా వస్తాయి..

శాంతిభద్రతలు ఉంటేనే పెట్టుబడలు వస్తాయని, యువకులకు ఉద్యోగ, ఉపాధి కల్పన జరుగుతుందన్నారు రేవంత్. అలాకాకుండా రోజూ కొట్లాడుకుని చస్తుంటే ఎవరైనా పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వస్తారాల.. ప్రాజెక్టులు వస్తాయా మన ప్రాంతం అభివృద్ధి చెందుతుందా.. అని ప్రశ్నించారు.

ఈ రాష్ట్రానికి నిన్నా మొన్న ప్రధాని నరేంద్ర మోడీ, అమిత్ షా వచ్చారని, కేంద్రంలో పెద్దలుగా ఉన్న వారు రాష్ట్రానికి వస్తే ఏదైనా తెస్తారేమో అనుకున్నామని, అలా ఏమీ జరగలేదన్నారు. ఈ ప్రాంతానికి మెట్రో రైలుతో పాటు పెండింగ్ ప్రాజెక్టులకు అనుమతులు ఇవ్వకపోగా ఇక్కడి ఓట్లు కొల్లగొట్టాలని చూస్తున్నారని ధ్వజమెత్తారు.

బీజేపీ అధికారంలోకి వచ్చిందంటే అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని సమూలంగా మార్చుతారని. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ఇచ్చిన రిజర్వేషన్లు రద్దు చేస్తారన్నారు.

ప్రస్తుతం తెలంగాణలో పేదల ప్రభుత్వం నడుస్తోందని, తాను కేవలం రబ్బరు స్టాంపును మాత్రమేనని రేవంత్ చెప్పుకున్నారు. ముఖ్యమంత్రి కార్యాలయంలో అంతా జగ్గారెడ్డిదే పెత్తనమని నవ్వుతూ అన్నారు. ఈ ప్రాంతానికి కాంగ్రెస్ ఎన్నో సంస్థలను తీసుకువచ్చిందని,. అందుకే కాంగ్రెస్ కు అండగా నిలబడాలని పిలుపునిచ్చారు. నీలం మధు, కాటాశ్రీనివాస్ గౌడ్ రామలక్ష్మణుల్లా కలిసి పని చేస్తే మీ రాజకీయ భవిష్యత్ ను తాము చూసుకుంటానని హామీ ఇచ్చారు.

### పటాన్ చెరును అభివృద్ధి చేస్తా -నీలం మధు

రేవంత్ రెడ్డి బడుగు, బలహీన వర్గాల పక్షపాతి అని, ఈ తాను స్థానికంగా పుట్టి పెరిగిన వ్యక్తిని. తన తల్లిదండ్రులు లేకపోయినా మీరే నాకు తల్లిదండ్రులు అని తనను ఆదరించి గెలిపించాలని మెదక్ కాంగ్రెస్ నీలం మధు అన్నారు. కాంగ్రెస్ పార్టీ సమానత్వం కోసం పని చేసే పార్టీ అయితే బీజేపీ మతం పేరుతో, బీఆర్ఎస్ ప్రాంతీయ వాదం పేరుతో ఓట్లు అడుగుతోందని విమర్శించారు.

కేంద్రంలో ఇండియా కూటమి అధికారంలోకి రాబోతున్నదని ధీమా వ్యక్తం చేసిన నీలం మధు.. ఇక్కడ తనను ఎంపీగా గెలిపిస్తే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో రాష్ట్రం నుంచి కేంద్రంలోని ఇండియా తరపు కేంద్రం నిధులతో పటాన్ చెరు నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానన్నారు.

# అమలులోకి 144 సెక్షన్.. ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి : సీఈవో వికాస్‌రాజ్

హైదరాబాద్, మే 11 : తెలంగాణలో ఈ నెల 13న జరిగే పార్లమెంట్ ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని సీఈవో వికాస్ రాజ్ తెలిపారు. రాష్ట్రంలో 144 సెక్షన్ అమలులోకి వచ్చిందని చెప్పారు. దాంతో కారణంగా నలుగురి కంటే ఎక్కువ మంది కలిసి ఉండొద్దన్నారు. 3.32కోట్ల మంది ఓటుహక్కు ఓటు వేసేలా 35,808 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. హైదరాబాద్‌లో ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ప్రచారం పూర్తికావడంతో తదుపరి ఏర్పాట్లపై దృష్టి పెట్టామన్నారు.

ఆదివారం ఉదయం నుంచే పోలింగ్ కేంద్రాలకు పోలింగ్ బృందాలు బయలుదేరి వెళ్తాయన్నారు. 13న ఉదయం 5.30 గంటలకు మాక్ పోలింగ్ ప్రారంభమవుతుందని.. నక్సల్స్ ప్రభావిత ప్రాంతాల్లో మినహా మిగతా ప్రాంతాల్లో 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ జరుగుతుందన్నారు. మారుమూల ప్రాంతాల్లోని మూడు పోలింగ్ కేంద్రాల్లో 10,12,14 మంది ఓటర్లు ఉండగా, 13 పోలింగ్ కేంద్రాల్లో 25 మందిలోపు ఓటర్లు, 23 పోలింగ్ కేంద్రాల్లో 50లోపు ఓటర్లు ఉన్నారన్నారు.

9,900 పోలింగ్ కేంద్రాలను సమస్యాత్మకంగా గుర్తించామని.. శాంతిభద్రతలకు విఘాతం కలుగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. 12వేలమంది మైక్రో అబ్జర్వర్లను నియమించామని.. అన్ని పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్, వీడియోగ్రఫీ చేస్తున్నట్లు వివరించారు. తీవ్రవాద ప్రభావిత ప్రాంతాల్లో సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ పూర్తవుతుందన్నారు. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన నాటి నుంచి రూ.320కోట్ల నగదు, ఉచితాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. తనిఖీలకు సంబంధించి 8వేలకుపైగా కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ఎన్నికల సామగ్రి, ఎన్నికల సంబంధించి బల్క్ ఎస్ఎంఎస్‌లను ప్రదర్శించడం పూర్తిగా నిషేధించినట్లు తెలిపారు.

సీ విజిల్, టోల్‌ఫ్రీ ద్వారా వస్తున్న ఫిర్యాదులపై వెంటనే చర్యలు తీసుకున్నామని వివరించారు. 1.90లక్షల మంది సిబ్బంది పోలింగ్ విధుల్లో పాల్గొంటారని.. 161 కంపెనీల కేంద్ర సాయుధ దళాలు, పారా మిలిటరీ బలగాలతో మొత్తం 70వేల మంది సిబ్బందిని ఎన్నికల విధులకు కేటాయించినట్లు తెలిపారు. అనేక నియోజకవర్గాల్లో అభ్యర్థుల సంఖ్య ఎక్కువగా ఉన్నట్లు బ్యాలెట్ యూనిట్లలో ప్రదర్శించబడే అభ్యర్థుల క్రమాన్ని తనిఖీ చేయాలని, సరైన వారిని ఎంపిక చేసుకోవాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. పోలింగ్ స్టేషన్ వివరాలను తెలుసుకునేందుకు 1950లో ఎస్ఎంఎస్ సేవలను ప్రారంభించినట్లు చెప్పారు.

పోలింగ్ కేంద్రాలలో అన్నికి మౌలిక వసతులను అందుబాటులో ఉంచామన్నారు. ఇప్పటి వరకు 20వేల మంది ఓటర్లు హోం ఓటింగ్ వేశారన్నారు.

1.88లక్షల మంది పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకున్నారని చెప్పారు. ప్రచార సమయం ముగిసిన తర్వాత నియోజకవర్గాల్లో ఇతరులు ఉండకూడదన్నారు. రేపు, ఎల్లుండి దినపత్రికల్లో ప్రకటలు ఇవ్వాలంటే అనుమతి తీసుకోవాలన్నారు.

మే 13న అన్ని కంపెనీలు వేతనంతో కూడిన సెలవులు ఇవ్వాలని, లేకపోతే ఆయా సంస్థలపై చర్యలుంటాయని హెచ్చరించారు.

జూన్ 1న సాయంత్రం 6.30 గంటల వరకు ఎగ్జిట్ పోల్స్‌పై నిషేధం కొనసాగుతుందని వివరించారు.

# 50 సీట్లు గెలిస్తే గొప్పే..ఈసారి కాంగ్రెస్‌కు ప్రతిపక్ష హోదా కూడా ఉండదు - మోదీ

న్యూఢిల్లీ, మే 11 :ఈ లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 50 సీట్లైనా గెలవదని ప్రధాని మోదీ జోస్యం చెప్పారు. ఎన్నికల తర్వాత హస్తం పార్టీ ప్రతిపక్ష హోదాను కోల్పోతుందని ఎద్దేవా చేశారు. ఒడిశాలోని ఫుల్బానీలో శనివారం జరిగిన ఎన్నికల ర్యాలీలో కాంగ్రెస్, బీజేడీపై తీవ్ర విమర్శలు గుప్పించారు. 26 ఏళ్ల క్రితం రాజస్థాన్?లో ఇదే రోజున (మే 11) మాజీ ప్రధాని వాజ్?పేయీ ప్రభుత్వం నిర్వహించిన పోఖ్రాన్ అణుపరీక్షలు ప్రపంచవ్యాప్తంగా దేశ ప్రతిష్ఠను పెంచాయని గుర్తు చేశారు.



అయోధ్యలో రామ మందిరం నిర్మించడం ద్వారా దేశ ప్రజల 500 ఏళ్ల నిరీక్షణకు బీజేపీ తెరదించిదన్నారు. ఒడిశాలో తొలిసారి డబుల్ ఇంజిన్ సర్కార్ ఏర్పడబోతుందని ప్రధాని మోదీ ధీమా వ్యక్తం చేశారు. ఒడియా భాష, సంస్కృతిని అర్థం చేసుకున్న వ్యక్తి ఒడిశాలో ఏర్పడబోయే బీజేపీ ప్రభుత్వంలో సీఎం అవుతారని అన్నారు.

# వీళ్లంతా.. బీజేపీకి బీ టీమ్.. బాబు, జగన్, పవన్‌పై రాహుల్ ఫైర్

న్యూఢిల్లీ, మే 11 :ఏపీలో బీజేపీ 'బీ' టీమ్ నడిపిస్తోందని, బీజేపీ అంటే బాబు, జగన్, పవన్.. వీళ్ళ రిమోట్ కంట్రోల్ మొత్తం నరేంద్ర మోడీ చేతిలో ఉందని కాంగ్రెస్ పార్టీ జాతీయ నాయకుడు రాహుల్ గాంధీ అన్నారు. ఎన్నికల ప్రచార నిమిత్తం కడప పట్టణంలో శనివారం జరిగిన బహిరంగ సభలో ఏఐసీసీ అగ్ర నేత రాహుల్ గాంధీ మాట్లాడుతూ.. ఏపీ హక్కులపై ఢిల్లీలో వైఎస్ఆర్ పోరాటం చేశారని, ఇక్కడి పాలకులు దోచుకోవడమే పనిగా పెట్టుకున్నారన్నారు. మోడీ చేతిలో సీబీఐ ఉంది.. ఈడీ ఉంది.. అందుకే బీ టీమ్ మోదీ చెప్పు చేతుల్లో ఉన్నారన్నారు. రాజకీయాల్లో కుటుంబ సంబంధాలు ఉంటాయని, వైఎస్ఆర్ నా తండ్రికి సోదరుడు.. రాజీవ్, వైఎస్ఆర్ ఇద్దరు అన్న తమ్ముళ్లు. ఈ బంధం చాలా ఏళ్ళ కిందటి నుంచే ఉందన్నారు. వైఎస్ఆర్ దేశానికి మార్గదర్శకుడని, వైఎస్ఆర్ పాదయాత్ర నాకు ఆదర్శం అన్నారు. ఆయన స్ఫూర్తితోనే నేను జోడో యాత్ర చేశాను అని రాహుల్ గాంధీ అన్నారు.



### వైఎస్ఆర్ స్ఫూర్తితోనే జోడో యాత్ర

దేశం మొత్తం పాదయాత్ర చేయాలనివైఎస్ఆర్ నాకు చెప్పారని.. నాకు అన్ని విషయాల్లో మార్గదర్శకుడిగా ఉన్నారని రాహుల్ అన్నారు. పాదయాత్ర చేస్తే ప్రజల్లోకి వెళ్తాం అని వైఎస్ఆర్ నాకు చాలాసార్లు చెప్పారన్నారు. పాదయాత్రతో ప్రజల కష్టాలు తెలుస్తాయని, అందుకే భారత్ జోడో యాత్రతో ఈ దేశపు వీధులన్నీ తిరిగానన్నారు. వైఎస్ఆర్ సామాజిక న్యాయం కోసం రాజకీయం చేశాడని, ఇప్పుడు ఏపీలో అది లేదన్నారు. ఇప్పుడు మార్పు రాజకీయాలు నడుస్తున్నాయి అని వివరించారు.

### అక్రమాలు బయట పడతాయనే భయం

వైఎస్ఆర్ సిద్ధాంతం.. కాంగ్రెస్ సిద్ధాంతం ఒకటే.. బీజేపీకి వ్యతిరేకం అని, జగన్ మాత్రం బీజేపీ కి మద్దతుగా ఉన్నారన్నారు. అవినీతి బయట పడుతుందనే భయంతోనే బీజేపీ నీ జగన్ ఒక్క మాట అనరు. ఇదే భయం చంద్రబాబుకూ ఉందన్నారు. ఏపీ హక్కులు ఢిల్లీలో వినపడాలి అంటే.. కాంగ్రెస్ రావాలన్నారు. ఏపీ విభజన అయ్యాక బీజేపీ ఎన్నో హామీలు చేసింది.. ఇచ్చిన వాగ్దానాలను ఒక్కటి అమలు చేయలేదన్నారు. ప్రత్యేక హోదా వచ్చిందా?.. పోలవరం కట్టారా?. కడప స్టీల్ కట్టారా?. బీజేపీ ముందు ఏపి ఆత్మ గౌరవం తల దించుకొని ఉంది అని రాహుల్ ప్రశ్నించారు.

### ఏపీలో అవినీతి సర్కారు నడుస్తోంది

ఏపీలో అవినీతి సర్కారు నడుస్తోందని, 2014 లో కాంగ్రెస్ మళ్ళీ అధికారంలో వచ్చి ఉంటే అన్ని హామీలు నెరవేర్చేదన్నారు. 2024లో కాంగ్రెస్ అధికారంలో వచ్చాకా ఇచ్చిన ప్రతి వాగ్దానం అమలు చేస్తామన్నారు. 10 ఏళ్లు ప్రత్యేక హోదా ఇస్తామని, పోలవరం ప్రాజెక్టు, కడప స్టీల్ ప్లాంట్ కడతామన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో మేము కొన్ని వాగ్దానాలు ఇచ్చామని, రూ. 2 లక్షల రుణమాఫీ చేస్తాం, కేజీ టూ పీజీ ఉచిత విద్య అమలు చేస్తాం, నిరుపేదలకు పక్కా ఇండ్లు కట్టించి ఇస్తాం, రాష్ట్రంలో 2.25లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తాం అని రాహుల్ హామీ ఇచ్చారు.

అధికారంలోకి రాగానే అన్నీ

కేంద్రంలో అధికారంలోకి రాగానే చరిత్రలో ఎవరు చేయని ఆలోచనలు చేస్తున్నామన్నారు. ప్రతి కుటుంబం నుంచి ఒక బీద మహిళను ఎంపిక చేసి.. ఆ మహిళ బ్యాంక్ ఖాతాలో లక్ష రూపాయలు ఏడాదికి ఇస్తామన్నారు. ప్రతి నెల 8500 రూపాయలు ఇస్తామని, కోట్లాది మంది జీవిత శైలి మారుతుందన్నారు. రైతులకు కనీస మద్దతు ధర ఇస్తామన్నారు. ప్రతి ఏడాది 20 లక్షల ఉద్యోగాలు ఇచ్చే బాధ్యత మాదీ అన్నారు. ఉపాధి హామీ పథకాన్ని రూ.400లకు కి పెంచుతామని, రాజ్యాంగాన్ని రక్షించే పనిలో ఉన్నామన్నారు. ఈ రాజ్యాంగం పరిరక్షిస్తే మనకు హోదా వస్తుందన్నారు. మోడీ ఈ రాజ్యాంగాన్ని నాశనం చేయాలని చూస్తున్నారు. మోడీ తన సొంత రాజ్యాంగాన్ని అమలు చేస్తున్నాడు. భారతీయుల భవిష్యత్ మన రాజ్యాంగం మీద ఆధారపడి ఉందన్నారు.

### చార్జి షీట్ లో వైఎస్ పేరు చేర్చలేదు..

కాంగ్రెస్, వైఎస్ఆర్ ఒక్కటే.. వైఎస్ఆర్ కాంగ్రెస్ లోనే ఉన్నారు.. కాంగ్రెస్ పార్టీ వైఎస్ఆర్ ఆలోచనలకి వ్యతిరేకంగా కాదన్నారు. సీబీఐ ఛార్జ్ షీట్ లో కాంగ్రెస్ పార్టీ వైఎస్ఆర్ పేరును చేర్చలేదు.. ఇది స్వార్థం కోసం చేసిన పనే అన్నారు. వైఎస్ఆర్ మా వాడు, వైఎస్ఆర్ బిడ్డ నా చెల్లెలు షర్మిల ఇవ్వాళ మీ ముందు నిలబడిందన్నారు. షర్మిల ముందు ఏ సీబీఐ, ఏ ఈడీ నడవదన్నారు. షర్మిలను పార్లమెంటుకు పంపుతామని హామీ ఇవ్వాలని రాహుల్ కోరారు.

# బీజేపీ ఉన్నంత వరకు పీవోకే పాక్ వశం కాదు... అమిత్ షా

న్యూఢిల్లీ, మే 11 :పాక్ ఆక్రమిత కాశ్మీర్ భారత్ అధీనంలోనే ఉంటుందని, బీజేపీ ఉన్నంత వరకు పీవోకే పాక్ వశం కాకుండా చూస్తుందని బీజేపీ అగ్రనేత, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా అన్నారు. శనివారం వికారాబాద్‌లో బీజేపీ నిర్వహించిన ఎన్నికల ప్రచార సభలో ఆయన పాల్గొని ప్రసంగించారు. సర్జికల్ స్ట్రైక్స్ చేసే దమ్ము కాంగ్రెస్ ప్రభుత్వానికి లేదని కౌంటర్ ఇచ్చారు. సర్జికల్ స్ట్రైక్స్ ద్వారా పాకిస్థాన్‌లోని ఉగ్రవాదులను ఏరి పారేశామని తెలిపారు. కశ్మీర్ ఎప్పటికీ భారత్‌లో అంతర్భాగంగానే ఉంటుందని తేల్చి చెప్పారు. సర్జికల్ స్ట్రైక్స్ గురించి సీఎం రేవంత్ రెడ్డి తమాషాగా మాట్లాడుతున్నారని ఫైర్ అయ్యారు. తెలంగాణ ప్రజలకు కశ్మీర్‌తో పని ఏంటని రేవంత్ రెడ్డి ప్రశ్నిస్తున్నాడు, కానీ తెలంగాణ ప్రజలు కాశ్మీర్ కోసం ప్రాణత్యాగానికి కూడా సిద్ధపడతారని ఎమోషనల్ కామెంట్స్ చేశారు. తన వీడియోను మార్ఫింగ్ చేసి రేవంత్ పెద్ద తప్పు చేశారని వ్యాఖ్యానించారు. రిజర్వేషన్లపై తప్పుడు ప్రచారాన్ని చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

దేశంలో ఉగ్రవాదాన్ని పారద్రోలడానికి ప్రధాని మోడీ చేశారని, కాంగ్రెస్ పార్టీ మాత్రం ఉగ్రవాదులను కాపాడుతూ వచ్చిందని ధ్వజమెత్తారు. అయోధ్యలో రామ మందిర నిర్మాణ అంశాన్ని కాంగ్రెస్ 70 ఏళ్లుగా నాన్చుతు వచ్చిందని ఫైర్ అయ్యారు.

మోదీ రెండోసారి అధికారంలోకి వచ్చాక కేవలం ఐదేళ్లలో రామ మందిరం నిర్మించామన్నారు. రామ మందిర ప్రాణప్రతిష్టలో కూడా కాంగ్రెస్ నేతలు పాల్గొనలేదని నిప్పులు చెరిగారు. మజ్లిస్ ఓటు బ్యాంక్ కోసం రేవంత్ రెడ్డి భయపడుతున్నారని, బీజేపీ మాత్రం ఓటు బ్యాంక్ కోసం ఎన్నడూ భయపడలేదని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏనాడు తెలంగాణ అభివృద్ధికి కృషి చేయలేదని మండిపడ్డారు. కాంగ్రెస్ మజ్లిస్‌ను రాష్ట్రం నుండి తరిమే శక్తి బీఆర్ఎస్‌కు లేదని.. కేవలం బీజేపీకే కాంగ్రెస్, మజ్లిస్‌ను తరిమే పవర్ ఉందని పేర్కొన్నారు.

# దేశ ప్రజల మధ్య చిచ్చుపెట్టి లబ్ధి పొందాలని చూస్తున్న బిజెపి

న్యూ డిల్లీ మే 11 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);దేశ ప్రజల మధ్య చిచ్చుపెట్టి లబ్ధి పొందాలని బిజెపి ప్రయత్నిస్తుందని ప్రియాంకగాంధీ అన్నారు. గడిచిన పదేళ్లలో మోదీ సర్కార్ బడా వ్యాపారుల కోసం మాత్రమే పనిచేసిందన్నారు. పేదలు, బడుగు, బలహీన వర్గాల కోసం మోదీ ప్రభుత్వం ఏనాడు పనిచేయలేదని విమర్శించారు.

మోదీ తన మిత్రులకోసం రూ.16 లక్షల కోట్ల రుణాలు మాఫీ చేశారని.. పేదలకు మాత్రం మోదీ సర్కార్ చేసిందేమీ లేదన్నారు. వాస్తవాలు తెలియకుండా మీడియాను మేనేజ్ చేస్తున్నారని ఫైరయ్యారు. గత ఎన్నికల్లో తెలంగాణ ప్రజలు ప్రజా ప్రభుత్వాన్ని ఎన్నుకున్నారని ప్రియాంకగాంధీ అన్నారు. బీజేపీ అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని రద్దు చేయాలని చూస్తుందని.. బిజెపి కుట్రను అడ్డుకోవాలంటే కాంగ్రెస్ ను గెలిపించాలని ప్రియాంక గాంధీ చెప్పారు.

# కాంగ్రెస్ చెప్పేవన్నీ అబద్దాలే.. రేవంత్ వ్యాఖ్యాలతోనే తెలంగాణకు నష్టం - కెసిఆర్

హైదరాబాద్, మే 11 :తెలంగాణ ఆర్థిక పరిస్థితిపై కాంగ్రెస్ అవాస్తవాలు చెబుతోందని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అన్నారు. రాష్ట్రం దివాలా తీసిందని ఏ ముఖ్యమంత్రి కూడా చెప్పరన్నారు. శనివారం ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ? కాంగ్రెస్ పార్టీ చిల్లర రాజకీయాల కోసం అమూల్యమైన సమయాన్ని వృథా చేసిందని విమర్శించారు.

నాలుగైదు నెలల కాలంలోనే ప్రజలు కాంగ్రెస్ పార్టీపై తీవ్ర ఆగ్రహంతో ఉన్నారన్నారు. రాష్ట్రాభివృద్ధిపై కాంగ్రెస్ తక్కువ దృష్టి పెట్టిందన్నారు. ప్రత్యేక రాష్ట్రం వచ్చిన కొత్తలో కరెంట్ కోతలు బాగా ఉండేవన్నారు. కానీ తమ ప్రభుత్వం వచ్చిన 4 నెలల్లో విద్యుత్ కోతలను పరిష్కరించామన్నారు.

కాంగ్రెస్ సరూర్ నగర్ సభకు కనీసం 3 వేలమంది ప్రజలు కూడా హాజరు కాలేదన్నారు. కాంగ్రెస్ సభల్లో ఖాళీ కుర్చీలు దర్శనమిస్తున్నాయన్నారు. కాంగ్రెస్ పాలనలో కరెంట్ కోతలు తప్పడం లేదన్నారు. విద్యుత్ కోతలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని విమర్శించారు. హైదరాబాద్‌ను తాము పవర్ ఐలాండ్‌గా మార్చామన్నారు. కాంగ్రెస్ పాలనలో పరిశ్రమలు అన్నీ తరలిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కేసీఆర్ పక్కకు జరగగానే కరెంట్ కష్టాలు ఎందుకు ప్రారంభమయ్యాయని ప్రశ్నించారు. కష్టపడి బతికే కార్మికులకు ఉపాధి లేకుండా పోయిందన్నారు.

పంద్రాగస్ట్ లోగా రుణమాఫీ చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారని? కానీ ఏ సంవత్సరం ఆగస్టో చెప్పాలని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పార్టీ చేసిన తప్పులే లోక్ సభ ఎన్నికల్లో ఆ పార్టీని కాటేస్తాయన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఉన్నంత జోష్ కాంగ్రెస్ నేతల్లో ఇప్పుడు లేదన్నారు. చేనేత కార్మికులను ఆదుకోవడానికి బతుకమ్మ చీరల ఆర్డర్ ఇచ్చామన్నారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక వారి బకాయిలు కూడా చెల్లించడం లేదన్నారు. తాను చేనేత కార్మికుల కోసం ఏదో వ్యంగ్యంగా మాట్లాడితే తన గొంతును 48 గంటలు బంద్ చేశారన్నారు. బీఆర్ఎస్ హయాంలో కరెంట్ పోతే వార్త అన్నట్లుగా ఉండేదన్నారు. వరికి బోనస్ మొత్తాన్ని ఇవ్వడం లేదన్నారు.

కాంగ్రెస్ అధికారం చేపట్టిన నాలుగైదు నెలల్లోనే రాష్ట్రం రూపు రేఖలను మార్చేశారని అన్నారు. ఇప్పుడు ప్రజల ఆలోచన మారిందన్నారు. గతేడాది అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ లో కనిపించిన జోష్.. ఇప్పుడు కనిపించడం లేదని జోస్యం చెప్పారు. ప్రభుత్వం భేషజాలకు వెళ్లి చాలా నష్టపోయిందన్నారు.

వైఎస్సార్ హయాంలో అమలు చేసిన ఆరోగ్యశ్రీని, ఫీజు రీ ఎంబర్స్‌మెంట్ ను.. తాము కొనసాగించామని చెప్పారు. రాష్ట్రంలో ఇప్పుడు కరెంట్ కోతలు పెరిగాయని, నీటి కొరత ఏర్పడిందని ఇదంతా కాంగ్రెస్ ప్రభుత్వం చేతగానితనంగా అభివర్ణించారు. గత తొమ్మిదేళ్లలో లేని కరెంట్ కోతలు, నీటి ఎద్దడి ఇప్పుడు ఎందుకొచ్చాయని ప్రశ్నించారు. ఒకసారి తాను ఉన్న ప్లేస్ లోనే కరెంట్ కట్ అయితే.. ట్వీట్ చేశానన్న కేసీఆర్.. ప్రభుత్వం పట్టించుకోదని పదే పదే చేయడం మానేసినట్లు చెప్పారు. తాను వెళ్లిన 7–8 ప్రాంతాల్లో కరెంట్ కట్ అయిందని పేర్కొన్నారు.

బీఆర్ఎస్ హయాంలో అన్ని రంగాలకు నిరంతరాయంగా కరెంట్ ఇచ్చిన తెలంగాణలో ఇప్పుడు కరెంట్ కోతలు పెరిగి ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు. సింగరేణిలో బొగ్గు కొరత లేదు, నీటి కొరత లేదు, ఎలాంటి కొరత లేకుండా కరెంట్ కట్ ఎందుకు కట్ అవుతుందని మీడియా ముఖంగా ప్రశ్నించారు. హైదరాబాద్ లో ఇటీవల కురిసిన వర్షానికి చాలా ప్రాంతాల్లో 6–7 గంటలు కరెంట్ కట్ చేశారని వాపోయారు. ప్రగతి, పెట్టుబడులు, ఐటీ కంపెనీల తీరుతెన్నులు గమనించి హైదరాబాద్‌ను పవర్ ఐలాండ్ చేశానని, న్యూయార్క్ లో లండన్ లోనైనా పవర్ పోద్దేమో గానీ.. హైదరాబాద్ లో పవర్ పోదనే స్థాయికి తీసుకొచ్చానని.. మళ్లీ హైదరాబాద్ కు పవర్ కట్స్ మొదలయ్యాయని చెప్పుకునే స్థాయికి కాంగ్రెస్ తీసుకొచ్చిందని విమర్శించారు.

కరెంట్ లేక లక్షల ఎకరాల్లో పంట నష్టం, మోటార్లు కాలిపోవడం దురదృష్టకరమన్నారు. రైతులు కూడా కరెంట్ షాక్ లు తగిలి మరణించారని,. మంచినీటి సరఫరా వ్యవస్థ కూడా పాడైందని వాపోయారు కేసీఆర్. ప్రతి వేసవిలో తెలంగాణలో మంచినీటి ఇబ్బంది ఉండకూడదని మిషన్ భగీరథను తీసుకొచ్చాం. వీధి కుళాయిలు లేకుండా ఇంటింటికీ నల్లా కనెక్షన్ ఇచ్చాం. దొంగతోపు వంటి గూడెంకు కూడా నీటిని సప్లై చేశాం. వాటర్ బిజినెస్ ఆగింది. 3–4 నెలల్లో మళ్లీ మంచినీటి కష్టాలు మొదలయ్యాయి. దూరప్రాంతాల నుంచి బిందెలు మోస్తున్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన నాలుగైదు నెలల్లోనే.. కరెంట్ సరిగ్గా లేదు, మంచినీటి సరఫరా లేదు. మరి ప్రభుత్వం ఏం చేసిందని కేసీఆర్ నిలదీశారు. గత ప్రభుత్వం చేసిన అభివృద్ధిని కాపాడలేకపోయింది. 9 ఏళ్లుగా ఉన్నవి ఇప్పుడు ఏమయ్యాయని అడిగారు. బీఆర్ఎస్ చేసిన అభివృద్ధిని నిలబెట్టకపోగా మళ్లీ ప్రజల జీవితాలను తొమ్మిదేళ్లు వెనక్కి తీసుకెళ్తుందని దుయ్యబట్టారు.

# టీ షర్ట్స్, జీన్స్ వద్దు.. ఫార్మల్స్ ముద్దు.. ఆర్టీసీలో డ్రస్ కోడ్ ఆంక్షలు..

**-కార్యాలయ ఉద్యోగులు ఫార్మాల్ లో**
**-రావాలని సజ్జనార్ ఆదేశం**
**-డ్రైవర్లు, కండక్టర్లు ఖాకీ యూనిఫామ్ తప్పని సరి**



హైదరాబాద్, మే 11 :ఆర్టీసీ ఉద్యోగులు డ్యూటీలో టీషర్ట్స్, జీన్స్ వేసుకోవద్దని టీఎస్ ఆర్టీసీ ఎండీ సజ్జనార్ ఆదేశాలు జారీ చేశారు. ప్రస్తుతం ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లు ఖాకీ యూనిఫామ్ ధరిస్తున్నారు. మిగతా ఉద్యోగులకు డ్రెస్ కోడ్ లేకపోవడంతో క్యాజువల్స్‌లోనే కార్పొరేషన్, డిపోలకు విధులకు హాజరవుతున్నారు. ఈ నేపథ్యంలోనే ఇక నుంచి ఆర్టీసీ ఉద్యోగులందరూ డిగ్నిటీగా ఉండేందుకు ఫార్మల్స్, యూనిఫామ్‌లో రావాలని ఎండీ సజ్జనార్ సూచించారు.

### నేటి కందం- నేటికీ అందం

శంకల వంకలు దీర్చుచు
పంకిలములు కడుగ గలుగు వరగురుడై-దృ
క్పంకాశునిగా వెలిగెడి
శంకరుల జయంతి జనులు జరుపంగవలెన్

(శంకరాచార్య జయంతి తిథుల ప్రకారం)



-రాధశ్రీ
సెల్:9494481210

# మాతృదేవోభవ

## (12 మే 'మాతృదినోత్సవం' సందర్భంగా)

అమ్మ లేని జన్మ లేదు. అమ్మ పదానికి శత్రువు లేదు. కుటుంబాన్ని ఏకం చేసే మహాశక్తి అమ్మ. అన్నామృత వితరణశీలి అమ్మ. బొడ్డు పేగు బంధం రుచి చూపినా, మమతానురాగాలు పంచినా, ఇసుమంతైనా కృతజ్ఞతలే ఆశించని అపురూప దేవత అమ్మ. పిల్లల గుండెల్లో మహారాణియే కాదు, నవ్వుల పువ్వులు పూయించే జ్ఞాని అమ్మ. 'అమ్మ' అనేది అనిర్వచనీయ భావన. ఎలా కృతజ్ఞత తెలుపాలో తెలియనంత మహోన్నత శిఖరం. మాతృ హృదయం హిమాలయమంత చల్లదనం. ఆవేశమే ఎరుగని, బేషరతుగా ప్రేమను మాత్రమే పంచడం ఎరిగిన అమాయక త్యాగశీలి అమ్మ. ఆకాశమంత అనురాగం, అంతరిక్షమంత సహనం, ఎవరెస్టంత వ్యక్తిత్వం అమ్మ సొంతం. మాతృమూర్తి త్యాగానికి ప్రత్యామ్నాయం లేదు. ఆమెకు ఆమే సాటి, లేరెవరూ ఆమెకు పోటీ. ఓ శిశు జన్మ కోసం తాను నవ్వుతూ పునర్జన్మ పొందిన మహామనిషి అమ్మ.

### మే 2వ ఆదివారం 'మాతృ దినోత్సవం:

అమ్మ త్యాగాన్ని తలవని రోజుండదు. అయినా అమ్మ ఒడికి చేరి, పాదాభివందనం చేసి, ప్రత్యేక దీవెనలు పొందేందుకు ప్రతి ఏటా మే మాసపు రెండవ ఆదివారం, అనగా 12 మే 2024న ఇండియాతో పాటు ఇతర ప్రపంచ దేశాలు 'మాతృదినోత్సవం (మదర్స్ డే)' ఘనంగా నిర్వహించడం జరుగుతుంది. అమ్మను చూసినపుడు అపురూప ప్రేమకు రూపం దొరుకుతుంది. అమ్మ పాలలోనే కాదు ప్రేమలో కూడా అనంత స్వచ్ఛత కనిపిస్తుంది. అమ్మకు ప్రాణం పిల్లలు. పిల్లలకు ఉనికి, ఊపిరి అమ్మ. అమ్మకు అభయహస్తం నాన్న. అందరి ఆది గురువు అమ్మ.

### కళ్ళ ముందు నడిచే దేవత అమ్మ:

అమెరికాకు చెందిన 'అన్నా జార్విస్' ప్రారంభించిన 'మాతృ దినోత్సవం' రోజున ప్రతి ఒక్కరూ వారి వారి మాతృమూర్తుల చెంతకు చేరి తమకు తోచిన రీతిలో కృతజ్ఞతలను తెలియజేస్తూ, దీవెనలు తీసుకోవడం జరుగుతుంది. 1914లో తీసుకున్న నిర్ణయం ప్రకారం మదర్స్ డే పాటించడం జరుగుతోంది. అమ్మ ప్రేమను వ్యక్తం చేసే భావాలు లేవు, అక్షరాలు చాలవు. అయినా అమ్మ పట్ల తమ ప్రేమను తెలియజేస్తూ, అమ్మ దీవెనలు పొందడం, ఎప్పటిలాగే పాదాభివందనాలు చేయడం, భౌతికంగా దూరంగా ఉన్నట్లయితే ఉత్తరాలు రాయడం, పుష్పగుచ్ఛాలు సమర్పించడం, కేకులు కట్ చేయించడం, కానుకలు ఇవ్వడం, అమ్మ సేవల్ని గుర్తు చేసుకోవడం, అమ్మ త్యాగాలను గుర్తు చేసుకోవడం జరుగుతుంది. నవ మాసాలు మోసి, పురిటి తీపి నొప్పుల్ని భరించి, ఆలనాపాలన చూసి, తొలి పలుకులు నేర్పి, విద్యాబుద్ధులు అందించింది అమ్మానాన్నలే. మన ముందు నిలిచిన అమ్మనాన్నలే శివపార్వతులు అనే అపూర్వ భావన మన మనసులో నిండి ఉంటుంది. నిస్వార్థతకు, నిజాయితీగల ప్రేమకు, కొండంత త్యాగశీలతకు, అనిర్వచనీయ సురక్షకు నిలువెత్తు రూపంగా అమ్మను అనునిత్యం ఆరాధించే సంస్కృతి మన భారత సమాజంలో ఉంది. నవజాత శిశువు నుంచి పరిపూర్ణ వ్యక్తిగా ఎదిగే వరకు అమ్మ ప్రమేయం లేని రోజుండదు.

### పదవి విరమణ లేని ప్రేమమూర్తి అమ్మ:

అమ్మకు పదవి విరమణ లేదు. పిల్లల కోసం తపించని క్షణం ఉండదు. అమ్మ ముద్దు కన్న తీపిదనం లేదు, అమ్మ చనుబాల కన్న అమృతం లేదు. వయసు పెరుగుతుంది. కాలం మారుతుంది. ప్రేమలు తారుమారు కావచ్చు. స్నేహం బలహీన పడవచ్చు. బంధుత్వాలు తెగ వచ్చు. విడాకులు అమ్మనాన్నల్ని వేరు చేయవచ్చు. కాని అమ్మ ప్రేమ మాత్రం ఆఖరి ఘడియల వరకు అంతే తీవ్రతతో ఉండడమనేది సృష్టి రహస్యంగా ఎల్లకాలం నిలబడి పోయి ఉంటుంది. అమ్మ పదం వినగానే ప్రశాంత ప్రేమ మూర్తి గుర్తుకు వస్తుంది.

అమ్మకు పర్యాయ పదం అమ్మ మాత్రమే. అమ్మను మది కోవెలలో మాతృదేవతగా ప్రతిష్టించుకొని, ఆమె దీవెన మూటలు వెంట పెట్టుకొని, అమ్మ ఆశయాల సాధనకు కృషి చేద్దాం. అమ్మ ముఖంలో ఆనందాలు విరబూయడానికి కారణం అవుదాం. మాతృదేవోభవ.



- డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి,
99497 00037

# సైబర్ మోసగాళ్ళతో పోరాడడం కోసం చేతులు కలిపిన డిఓటి, ఎమ్‌హెచ్‌ఎ మరియు స్టేట్ పోలీసులు

న్యూఢిల్లీ, మే 11 :సైబర్ ప్రపంచం లో నేరాలు మరియు ఆర్థిక సంబంధి మోసాల కు పాల్పడేందుకు టెలికమ్ వనరుల ను దుర్వినియోగ పరచడాన్ని అడ్డుకొనేందుకు టెలికమ్యూనికేశన్స్ విభాగం (డిఓటి), దేశీయ వ్యవహారాల మంత్రిత్వ శాఖ (ఎమ్‌హెచ్‌ఎ) మరియు స్టేట్ పోలీస్ లు చేతులు కలిపాయి.

ఈ సహకార పూర్వకమైన ప్రయాస యొక్క లక్ష్యం మోసగాళ్ళ కు చెందిన నెట్ వర్క్ లను నష్టపరచడమూ మరియు పౌరుల ను డిజిటల్ బెదరింపుల బారి నుండి రక్షించడమూ ను.

సైబర్ జగతి లో చోటు చేసుకొన్న అపరాధాల లో 28,200 మొబైల్ హేండ్‌సెట్ లను దురుపయోగం చేసినట్లు గా ఎమ్‌హెచ్‌ఎ మరియు స్టేట్ పోలీస్ ల యొక్క విశ్లేషణ లో తేలింది. ఈ మొబైల్ హేండ్‌సెట్ లతో భారీ ఎత్తున 20 లక్షల నంబర్ లను ఉపయోగించినట్లు డిఓటి విశ్లేషణ జరిపి కనుగొంది. తదనంతరం, భారతదేశం అంతటా 28,200 మొబైల్ హేండ్‌సెట్ లను నిరోధించాలంటూ టెలికం సేవ ల సంస్థల కు డిఓటి ఆదేశాల ను జారీ చేసింది. అంతేకాకుండా, ఈ మొబైల్ హేండ్‌సెట్ లతో ముడిపడ్డ 20 లక్షల మొబైల్ కనెక్శన్ లను వెంటనే తిరిగి ధ్రువపరచ వలసిందిగాను, రీ-వెరిఫికేశన్ ప్రక్రియ లో విఫలం అయితే సదరు కనెక్శన్ లను తొలగించాలనీనూ డిఓటి ఆదేశించింది.

ఒక ఏకీకృత దృష్టికోణం సార్వజనిక సురక్ష మరియు టెలికమ్యూనికేశన్స్ సంబంధి మౌలిక సదుపాయాల అఖండత ను కాపాడటం తో పాటు ఒక భద్రమైన డిజిటల్ పర్యావరణాని కి పూచీ పడడం కోసం ఉమ్మడి వచనబద్ధత ను ప్రకటిస్తున్నది.

# గెజిట్ నోటిఫికేశన్ మాధ్యం ద్వారా ఇంటర్- సర్వీసెస్ ఆర్గనైజేశన్స్ (కమాండ్, కంట్రోల్ ఎండ్ డిసిప్లిన్)చట్టాన్ని నోటిఫై చేయడమైంది

న్యూఢిల్లీ, మే 11 :ఇంటర్-సర్వీసెస్ ఆర్గనైజేశన్స్ (కమాండ్, కంట్రోల్ ఎండ్ డిసిప్లిన్) చట్టాన్ని రాజపత్రం లో ప్రకటించడమైంది. ఈ చట్టం 2024 మే 10 వ తేదీ నుండి అమలు లోకి వస్తుంది. ఇంటర్-సర్వీసెస్ ఆర్గనైజేశన్స్ (ఐఎస్ఒ స్) యొక్క అధిపత్యాన్ని, నియంత్రణ ను, సమర్థమైన పనితీరు ను ఉత్తేజితం చేయడం కోసం ఉద్దేశించిన ఒక బిల్లు ను 2023 వ సంవత్సర వర్ష కాల సమావేశాల లో పార్లమెంటు ఉభయ చట్ట సభల లో ఆమోదించడమైంది. ఈ బిల్లు కు 2023 ఆగస్టు 15 వ తేదీ న రాష్ట్రపతి ఆమోదం లభించింది.

ఈ చట్టం ఐఎస్ఒ ల కమాండర్స్-ఇన్-చీఫ్ మరియు ఆఫీసర్స్-ఇన్-కమాండ్ కు సర్వీసు సిబ్బంది మీద నియంత్రణ అధికారాల ను అప్పగిస్తుంది. ఈ అధికారాలు ప్రతి ఒక్క వ్యక్తిగత సేవ తాలూకు విశిష్ట సేవ షరతుల పైన ప్రతికూల ప్రభావాన్ని ప్రసరించకుండా క్రమశిక్షణ ను మరియు పరిపాలన ను ప్రభావవంతమైన విధం గా నిర్వహించడం లో దోహద పడతాయి.

నోటిఫికేశన్ వెలువడడం తో, ఈ చట్టం ఐఎస్ఒ ల అధిపతుల కు కేసులను త్వరిత గతి న పరిష్కరించేందుకు, ఒక సారి చేసినటువంటి కార్యాలనే మళ్లీ మళ్లీ చేయవలసిరావడాన్ని నివారించేందుకు మార్గాన్ని సుగమం చేయడం తో పాటుగా సాయుధ దళాల సిబ్బంది మధ్య అధిక సమన్వయాన్ని ఏర్పరచే దిశ లో ఒక అడుగు ను వేసేటటువంటి అధికారాన్ని ఇస్తుంది.

# తవుడు బస్తాల మధ్య 7కోట్ల నగదు



అమరావతి, మే 11 :ఏపీలో శనివారం ఉదయం ఓ ప్రమాదం సంచలనం సృష్టించింది. తూర్పుగోదావరి జిల్లా పోలీసులకు భారీగా నోట్ల కట్టలు దొరికాయి. నల్లజర్ల మండలం అనంతపల్లి సమీపంలో టాటా ఏస్ వాహనాన్ని ఓ లారీ ఢీకొంది. అంతే టాటా ఏస్ వాహనం బోల్తా పడగా.. అందులో చేపల మేత తవుడు బస్తాల మధ్య 7 అట్టపెట్టెల్లో నగదు బయటపడింది. ఈ విషయాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఇక్కడ దొరికిన మొత్తం నగదు సుమారు రూ. 7కోట్లుగా అంచనా వేశారు. ఈ వాహనం విజయవాడ నుంచి విశాఖ వైపు వెళుండగా ఈ ఘటన చోటు చేసుకుంది. బోల్తాపడిన టాటా ఏస్ వాహన డ్రైవర్ తీవ్రంగా గాయపడటంతో అతడిని గోపాలపురం ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

# రేవంత్ రెడ్డి అత్యంత ప్రమాదకారి: కిషన్ రెడ్డి

హైదరాబాద్, మే 11 :అధికారం కోసం సీఎం రేవంత్ రెడ్డి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఎంతకైనా తెగిస్తారని బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి విమర్శించారు. కేసీఆర్ మాదిరిగానే రేవంత్ రెడ్డి ప్రమాదకారి అని హెచ్చరించారు. హైదరాబాద్ లో శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ? అబద్ధాలు ఆడటంలో వీరిద్దరూ ఆరితేరారన్నారు. కాంగ్రెస్ పార్టీ అబద్ధాలను ఇంటిపేరుగా మార్చుకుందని విమర్శించారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీల్లో ఉచిత బస్సు ప్రయాణం తప్ప ఏదీ అమలు కాలేదన్నారు. తన 100 రోజుల పాలన రెఫరెండమని సీఎం రేవంత్ రెడ్డి అన్నారని కానీ దేనిపైనో చెప్పాలన్నారు. కాంగ్రెస్ అవినీతి పైనా ఆర్ ఆర్ ట్యాక్స్ పైనా? లేక ఆరు గ్యారెంటీల అమలుపై రెఫరెండమా చెప్పాలని నిలదీశారు. దేశభక్తి, ధర్మబద్ధ పాలనకు ప్రజలు అండగా ఉండాలని ఆయన కోరారు. అబద్ధాలతో కాంగ్రెస్ ఏడు దశాబ్దాలుగా రాజకీయం చేస్తోందని విమర్శించారు. భద్రతా బలగాలపై కాంగ్రెస్ పార్టీకి ఏనాడూ నమ్మకం లేదన్నారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్నన్ని రోజులు ఆ పార్టీ చేతకానితనం, అసమర్థత కారణంగా పాకిస్థాన్ దౌర్జన్యాలకు అడ్డుకట్ట వేయలేకపోయామన్నారు. కానీ మోదీ హయాంలో భారత్ బలపడిందన్నారు.




శ్రీలేఖ సాహితి, వరంగల్

ఆహ్వానము

చెన్నమనేని రంగనాయకమ్మ స్మారక విశిష్టాద్వైత జాతీయ సాహిత్య పురస్కారం

12-05-2024 సాయంత్రం 5.00 గంటలకు
గౌ॥ శ్రీ ముప్పవరపు వెంకయ్య నాయుడు గారి గృహములో
జూబ్లీ హిల్స్, హైదరాబాద్

ముఖ్య అతిథి
"పద్మవిభూషణ్" గౌ॥ శ్రీ ముప్పవరపు వెంకయ్య నాయుడు
మాజీ ఉపరాష్ట్రపతి, భారత ప్రభుత్వం

సభాధ్యక్షులు
డా॥ రేవూరి అనంత పద్మనాభరావు

సత్కారములు
శ్రీమతి శ్రీదేవి మురళీధర్
హైదరాబాద్
డా॥ వైష్ణవ వేంకటరమణమూర్తి
నంద్యాల
శ్రీ గార రంగనాథం
రాజాం, విజయనగరం జిల్లా

పుస్తకావిష్కరణలు
శ్రీభాష్యము - కరదీపిక
వేదాంత దేశికులు - హంస సందేశము


## హజ్ యాత్రికులను సన్మానించిన ఎమ్మెల్యే శ్రీహరి

మహబూబ్‌నగర్, మే 11 : నారాయణ పేట జిల్లా మక్తల్ నుండి పవిత్ర హజ్ యాత్రకు వెళ్తున్న నూరుద్దీన్ ,కరమతుల్లాబేగ్ , వెల్దర్ జహంగీర్ , జహీద్ అలీ లను ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి సన్మానించారు. ఇవాళ మక్తల్ పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మక్తల్ హజ్ యాత్రికులకు సన్మానించి మాట్లాడుతూ భారతదేశం సర్వమత సమానత్వానికి పుట్టినిల్లు అన్నారు. హజ్ యాత్ర లో మక్తల్ ప్రాంతం అభివృద్ధి కోసం కోసం దువా చేయాలని విజ్ఞప్తి చేశారు.

# ఎన్నికల గెలిచేందుకు వైసిపి కుటిల యత్నాలు చంద్రబాబు



అమరావతి, మే 11 :ఎన్నికల్లో గెలిచేందుకు అధికార వైసీపీ కుటిల ప్రయత్నాలు చేస్తోందని దుయ్యబట్టారు చంద్రబాబు. పొత్తుల్లో భాగంగా జనసేన 21 సీట్లలో పోటీ చేస్తుంటే మిగిలిన చోట్ల ఇండిపెండెంట్లను ప్రొత్సహిస్తూ గాజు గ్లాసు గుర్తును కేటాయించేలా చేశారని దుయ్యబట్టారు. రానున్న ఐదేళ్లలో 20 లక్షలు ఉద్యోగాలు ఇచ్చే బాధ్యత తమదేనన్నారు చంద్రబాబు. నంద్యాలలో నేడు జరిగిన రోడ్ షోలో ఆయన మాట్లాడుతూ, యువత భవిష్యత్తుకు భరోసా ఇస్తామన్నారు . యువత అంతా సైకిల్ ఎక్కాలని పిలుపు నిచ్చారు. జాబు రావాలంటే కూటమి ప్రభుత్వం రావాలన్నారు. తాను, పవన్ కళ్యాణ్ వల్లే ఇదంతా సాధ్యమవుతుందన్నారు. తొలి సంతకం మెగా డీఎస్సీపైనే పెడతానన్నారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌పై రెండో సంతకమన్నారు.

పెంఛన్లు వెయ్యి నుంచి మూడు వేలకు తాము పెంచామంటూ సీఎం జగన్ అబద్దాలు చెబుతున్నారని గుర్తు చేశారు టీడీపీ అధినేత. ఆయన ఓ శాపం ఉందని, నిజం చెబితే తల బద్దలై వేయి ముక్కలు అవుతుందనారు. వృద్ధులను చంపి శవ రాజకీయాలు చేసే మనిషి జగన్ అని ఆరోపించారు. తాను ఇంటికి పెద్దకొడుకుగా ఉంటానని అంటూ. ఏప్రిల్ నుంచి నెలకు నాలుగు వేలు పించన్ ఇస్తామన్నారు. జులైలో బకాయిలతో కలిపి ఏడు వేలు ఇస్తామ న్నారు.జగన్ సర్కార్ తీసుకొచ్చిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌పై ఆగ్రహం వ్యక్తం చేసిన చంద్రబాబు , . వారస త్వం భూమిపై సైకో ఫోటో ఉండకూ దన్నారు. జగన్ మళ్లీ వస్తే మన భూ ములను అమ్ముకోవడానికి వీల్లేదన్నారు చంద్రబాబు. భూములపై అన్యాయం జరిగితే నేరుగా హైకోర్టుకే వెళ్లాల్సి ఉంటుందన్నారు. గతంలో ఉన్న పథకాలను మళ్లీ తీసుకొస్తామని హామీ ఇచ్చారు. టీడీపీ అభ్యర్థి ఫారూఖ్‌ను గెలిపించాలని ఓటర్లను కోరారు. పరిశ్రమలు తీసుకుని ఇక్కడి ప్రజలకు న్యాయం చేస్తామన్నారు టీడీపీ అధినేత.

# ఎన్నికల నేపథ్యంలో సొంతూళ్లకు తరలి వెళ్తున్న జనం

## రద్దీగా మారిన రైళ్లు, బస్సులు

- -ప్రత్యేక బస్సులతో పాటు ప్రత్యేక రైళ్లను ఏర్పాటు చేస్తున్న అధికారులు !
- -హైవే పై కనిపిస్తున్న వాహనాల రద్దీ
- -టోల్ ప్లాజాలు వద్ద బారులు తీరిన వాహనాలు
- -మళ్ళీ మొదలైన పల్లెల్లో పండగ వాతావరణం

విశాఖ సిటీ, మే 11 : ఎన్నికల నేపథ్యంలో విశాఖ నుంచి తమ సొంతూళ్లకు వేలాదిగా జనం తరలి వెళ్తున్నారు. ఈ క్రమంలో బస్సులన్నీ జనంతో నిండిపోయి కనిపిస్తున్నాయి. అలాగే రైళ్లు కూడా కిటకిటలాడుతున్నాయి. చాలామందికి రిజర్వేషన్ దొరక్కపోవడంతో ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తున్నారు. దీనిని తమకు అనుకూలంగా మార్చుకొని ప్రైవేటు వాహన యజమానులు జనం నుంచి భారీగా వసూలు చేస్తున్నారు.

కొందరు తమ సొంత వాహనాలతో బయలుదేరుతున్నారు. మరికొందరు ఇక తప్పనిసరి అని భావించి ప్రైవేట్ వాహనాల్ని ఆశ్రయిస్తున్నారు.రహదారులన్నీ కూడా రద్దీగా మారాయి. ముఖ్యంగా హైవే పై వాహనాల రద్దీ ఎక్కువగా ఉంది. విశాఖలో ఉపాధి కోసం వలస వచ్చిన వారు అలాగే ఇక్కడ చదువుకుంటున్న కొందరు ఇతర ప్రాంత విద్యార్థులు తప్పనిసరిగా తమ సొంత ఊరిలో ఓటు వినియోగించుకునేందుకు శనివారం ఇక్కడి నుంచి బయలుదేరారు. వీకెండ్ కావడంతో ఒకరోజు ముందే తమ సొంతూళ్లకు ప్రయాణం చేస్తున్నారు. ఇప్పటి వరకు నాయకులు, రాజకీయ పార్టీల మధ్య ఎన్నికల ప్రచారం హడావిడి కనిపించింది. అయితే శనివారం సాయంత్రం 6 గంటలతో ప్రచారానికి తెరపడనుంది.

ఈ నేపథ్యంలో రెండు తెలుగు రాష్ట్రాల్లో సరికొత్త సందడి నెలకొంది. ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు తమ నియోజకవర్గాలకు పయనమయ్యారు. దీంతో విశాఖ నగరం ఎటు చూసినా బస్ స్టాపులు, రైల్వే స్టేషన్ల వద్ద బ్యాగులు పట్టుకుని యువత దర్శనమిస్తున్నారు. అటు విశాఖ నుండి ఉత్తరాంధ్ర జిల్లాల్లో పలు ప్రాంతాలకు వెళ్ళేందుకు రైల్వేస్టేషన్లలో రద్దీ ఒక్కసారిగా పెరిగింది.

ఏపీకి వెళ్లే రైళ్ల దగ్గర జనజాతర కనిపిస్తోంది. ఇప్పటికే బస్సులన్నీ రిజర్వేషన్ అయిపోవడంతో ఖాళీ ఎక్కడా దొరక్క ట్రైన్స్‌కు వెళ్తున్నారు జనం. రైలులో సీటు కోసం ఆరాటపడుతున్నారు. ఏపీకి వెళ్లే రైళ్లకు అదనపు బోగీలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు రైల్వే అధికారులు. అలాగే విశాఖపట్నం నుండి సికింద్రాబాద్ వరకు అదనంగా పలు రైళ్లను ఏర్పాటు చేసినట్లు తెలుస్తోంది!

ఇదిలా ఉంటే కొందరు తమ సొంత వాహనాల్లో పెద్ద ఎత్తున ఊర్లకు తరలివెళ్తున్నారు. దీంతో ఆగనంపూడి, నక్కపల్లి, రాజమండ్రి, విజయవాడ-హైదరాబాద్ హైవేపై వాహనాల రద్దీ కనిపిస్తోంది. వీకెండ్, ఓట్ల జాతర రెండూ కలిసి రావడంతో ఉదయం నుంచే భారీగా వెళ్తున్నారు. ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఇదే అదనుగా భావించి కొన్ని ప్రైవేట్ ట్రావెల్స్ పెద్ద ఎత్తున టికెట్ ధరలను పెంచేశాయి. దీనిపై ట్రాన్స్ పోర్ట్ అధికారులు తగు చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు విజ&జప్తి చేస్తున్నారు. అయితే ఆర్టీసీ బస్సు సర్వీసులు పరిమితంగా ఉన్నప్పటికీ ఎన్నికల కోసం మరిన్ని బస్సులు అందుబాటులో ఉంచుతామని చెబుతోంది ఆర్టీసీ. అవసరానికి అనుగుణంగా బస్సు సర్వీసులను అందుబాటులో ఉంచుతామని, ప్రయాణికులు ఎవరూ ఆందోళన చెందాల్సిన పనిలేదంటున్నారు ఆర్టీసీ అధికారులు. పెద్ద ఎత్తున రద్దీగా ఉండే నగరాలు ఓట్ల జాతర నేపథ్యంలో బోసి పోయి తక్కువ ట్రాఫిక్ కనిపిస్తోంది.

# ఓటు వేయడం అందరి బాధ్యత

## - జిల్లా ఎన్నికల అధికారి మనజీర్

శ్రీకాకుళం, మే 11 :: మే 13న జరుగనున్న సార్వత్రిక ఎన్నికల పోలింగ్ లో ప్రతి ఒక్కరూ ఓటు వేసేందుకు తరలిరావాలని, ఓటు వేయడం మనందరి బాధ్యత అని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారిమనజీర్ జిలాని సామూన్ పిలుపునిచ్చారు. స్వీప్ కార్యక్రమంలో భాగంగా నీ ఓటు, నీ భవిష్యత్తు అంటూ ఓటు హక్కు వినియోగంపై 80ఫీట్ రోడ్డు మిల్లు జంక్షన్ వద్ద జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ నిర్వహించిన బైక్ ర్యాలీని జిల్లా కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు.

మిల్లు జంక్షన్ నుంచి ప్రారంభమైన ఈ బైక్ ర్యాలీ సూర్యమహల్, ఏడు రోడ్ల జంక్షన్ మీదుగా ఆర్టిసి కాంప్లెక్స్ వరకు ర్యాలీ నిర్వహించడం జరిగింది. ర్యాలీలో జాయింట్ కలెక్టర్ ఎం నవీన్, సహాయ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, రెవిన్యూ డివిజనల్ అధికారి సి హెచ్ రంగయ్య పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఓటుని వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. మే 13న జరుగనున్న సాధారణ ఎన్నికల్లో 2019 వ సంవత్సరం కన్నా ఎక్కువ శాతం ఓటింగ్ జరగాలన్నారు. ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరూ మే 13వ తేదీన పోలింగ్ రోజు ఓటు వేసేందుకు తరలిరావాలన్నారు. 18 సంవత్సరాలు నిండి ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరూ ఎన్నికల్లో పోలింగ్ రోజు ఓటు వేయాలన్నారు.

ఈ బైక్ ర్యాలీలో సహాయ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, డిఆర్డిఏ పిడి కిరణ్ కుమార్, ఎల్.డి.ఎం, సూర్య కిరణ్, మెప్మా పిడి కిరణ్, ఎన్వైకే కోఆర్డినేటర్ ఉజ్వల్, జిల్లా పౌర సంబంధాల అధికారి కె. బాల మాన్ సింగ్, హౌసింగ్ పి.డి గణపతి రావు, జిల్లా పర్యాటక అధికారులు ఎన్. నారాయణ రావు, సెట్‌శ్రీ సిఇఓ ప్రసాద రావు, ఇంటెక్ సభ్యులు ఎం శ్రీనివాస రావు, వివిధ శాఖల ఉద్యోగులు, పెద్ద సంఖ్యలో యువతి యువకులు తదితరులు పాల్గొన్నారు.

# కాకినాడలో పవన్ పర్యటనకు గ్రీన్ సిగ్నల్..

అమరావతి, మే 11 :జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్‌కు ఊరట దక్కింది. కాకినాడ సిటీలో జనసేనాని పర్యటనకు పోలీసులు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు.

కాకినాడలో ఎన్నికల ప్రచారానికి అనుమతి వచ్చింది. ఇవాళ కాకినాడ సిటీలో ప్రచారానికి వెళ్లాలని పవన్ కళ్యాణ్ భావించారు.

ఈ మేరకు పోలీసుల్ని కలిసి అనుమతి కోరారు.. అయితే అదే రోజు స్థానిక ఎమ్మెల్యే అభ్యర్థి ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి ప్రచారం కూడా ఉండటంతో అనుమతి నిరాకరించారు. అయినా సరే కూటమి నేతలు మాత్రం పట్టు వీడలేదు. పోలీస్ స్టేషన్‌లోనే మకాం వేయగా.. చివరికి శనివారం వేకువజామున అనుమతి ఇచ్చారు. దీంతో పవన్ కళ్యాణ్ ఇవాళ కాకినాడ సిటీలో ప్రచారానికి వెళుతున్నారు.

# కూటమిదే విజయం.. చివరిరోజున బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా

- -తిరుపతి, ఆదోనిలలో ఎన్నికల ప్రచారం
- -తిరుపతిలో లక్ష ఉద్యోగాలు ఇస్తామని హామీ
- -అబివృద్ధి, సంక్షేమమే బీజేపీ పాలసీ

తిరుపతి, మే 11 :ఏపీలో కూటమి గెలవబోతోందని బీజేపీ జాతీయాధ్యక్షుడు జేపీ నడ్డా అన్నారు. బీజేపీ, టీడీపీ, జనసేన కూటమికి ప్రజల ఆశీర్వాదాలు ఉన్నాయన్నారు. జగన్ ఒక మాఫియా నడుపుతున్నారని.. ఏపీలో ఇసుక, ల్యాండ్, లిక్కర్ మాఫియా జరుగుతోందని ఆరోపించారు. ప్రచారం పర్వంలో చివరి రోజైన ఇవాళ ఆయన తిరుపతిలో రోడ్ షో నిర్వహించారు.. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోదీ దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారన్నారు.



సంక్షేమం, అభివృద్ధి మోదీ నినాదమన్నారు.తిరుపతి కేంద్రంగా లక్ష ఉద్యోగాల కల్పన తమ లక్ష్యమని ఆయన ప్రకటించారు. తిరుపతి స్మార్ట్ సిటీగా ప్రకటించి అభివృద్ధి చేశామన్నారు. తిరుపతి ఎంతో గొప్ప పుణ్య క్షేత్రమని ఆయన అన్నారు. బీజేపీ దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తోందని.. సమాజంలోని ప్రతి వర్గానికి మేలు చేశామని జేపీ నడ్డా స్పష్టం చేశారు. కూటమి అభ్యర్థులను గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ సభ అనంతరం ఆయన ఆదోనిలో జరిగిన రోడ్ షోలో పాల్గొన్నారు..

# మే 14 నుండి 25 వరకూ జరగనున్న 77వ కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో పాల్గొనబోతున్న భారతదేశం

న్యూఢిల్లీ, మే 11 :త్వరలో జరగనున్న ప్రతిష్ఠాత్మకమైన కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్ 77వ ఎడిషన్ భారతదేశానికి ప్రత్యేక సందర్భంగా మారనుంది. కార్పోరేట్ ఇండియన్ డెలిగేషన్ ఆధ్వర్వంలో భారత ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వాల ప్రతినిధులు, పరిశ్రమ సభ్యులు భారతదేశ సృజనాత్మక ఆర్థిక వ్యవస్థను ప్రపంచంలోని ప్రముఖ చలనచిత్ర మార్కెట్‌లో మార్చే డు ఫిల్మ్‌లో అనేక ముఖ్యమైన కార్యక్రమాల ద్వారా ప్రదర్శిస్తారు.

77వ కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో దేశ ప్రముఖులు, సినీ ప్రముఖులు, నిర్మాతలు, దర్శకులు, నిర్మాతలు, ఫెస్టివల్‌లో పాల్గొనే ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రముఖులు మరియు ప్రతినిధుల కోసం ''భారత్ పర్వ్''ను నిర్వహించడం ఇదే మొదటిసారి. ప్రపంచవ్యాప్తంగా ఉన్న కొనుగోలుదారులు మరియు సేల్స్ ఏజెంట్లు మరియు అనేక సృజనాత్మక అవకాశాలను మరియు సృజనాత్మక ప్రతిభతో కూడిన గొప్ప బ్యాంకును ప్రదర్శిస్తారు. 2024 నవంబర్ 20-28 తేదీల్లో గోవాలో జరగనున్న 55వ భారత అంతర్జాతీయ చలన చిత్రోత్సవం (ఐఎఫ్ఎఫ్ఐ) అధికారిక పోస్టర్ ఉ ట్రైలర్‌ను ఈ భారత్ పర్వ్‌లో ఆవిష్కరించనున్నారు. 55వ ఐఎఫ్ఎఫ్ఐతో పాటుగా నిర్వహించబడే మొదటి ప్రపంచ ఆడియో-విజువల్ ఉ ఎంటర్‌టైన్‌మెంట్ సమ్మిట్ (వేవ్స్) కోసం "సేవ్ ది డేట్" విడుదలను కూడా భారత్ పర్వ్‌లో నిర్వహించనున్నారు.

108 విలేజ్ ఇంటర్నేషనల్ రివేరాలో జరుగుతున్న 77వ కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో భారత్ పెవిలియన్ మే 15న ప్రముఖ సినీ ప్రముఖుల సమక్షంలో ప్రారంభం కానుంది. కేన్స్‌లోని భారత్ పెవిలియన్ భారతీయ చలనచిత్ర కమ్యూనిటీకి వివిధ కార్యకలాపాలలో నిమగ్నమవ్వడానికి ఒక వేదికగా పనిచేస్తుంది. వీటిలో నిర్మాణ సహకారాన్ని పెంపొందించడం, క్యూరేటెడ్ నాలెడ్జ్ సెషన్‌లు, పంపిణీ ఒప్పందాలపై సంతకం చేయడం, గ్రీన్‌లైట్ స్క్రిప్ట్‌లు, బి2బి సమావేశాలు మరియు ప్రముఖ ఎంటర్‌టైన్‌మెంట్ మరియు మీడియా ప్లేయర్‌లతో నెట్‌వర్కింగ్ కార్యక్రమాలు నిర్వహించబడతాయి. పెవిలియన్‌ను నేషనల్ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎన్ఎఫ్‌డిసి) ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ ఉ ఇండస్ట్రీ (ఫిక్కి)తో కలిసి పరిశ్రమ భాగస్వామిగా నిర్వహిస్తుంది. పరిశ్రమను కనెక్ట్ చేయడంతో పాటు సహకరించడానికి కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సిఐఐ) ఆధ్వర్యంలో మార్చే డు కేన్స్‌లో 'భారత్ స్టాల్' ఉండనుంది.

అహ్మదాబాద్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజైన్ ఈ భారత్ పెవిలియన్‌ను రూపొందించింది. ఈ సంవత్సరం "క్రియేట్ ఇన్ ఇండియా" అనే థీమ్‌ను వర్ణించాడినికి 'ది సూత్రధార' అని పేరు పెట్టారు. ఇందులో భారతదేశ ఉనికిని పరిశీలిస్తే ఈ సంవత్సరం కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో గొప్ప చరిత్ర మరియు సృజనాత్మకతను అంతర్జాతీయ వేదికపై ఆవిష్కరిస్తాయి.

ఇక స్పాట్‌లైట్‌లో ప్రేక్షకులను ఆకర్షించడానికి మరియు ప్రతిష్ఠాత్మకమైన పామ్ డి'ఓర్ కోసం పోటీ పడడానికి పాయల్ కపాడియా యొక్క మాగ్నమ్ ఓపస్ "ఆల్ వి ఇమేజిన్ యాజ్ లైట్" సిద్ధంగా ఉంది. మూడు దశాబ్దాల తర్వాత కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్ అధికారిక ఎంపిక పోటీ విభాగంలో భారతీయ టైటిల్ పొందడం వలన ఇది ఒక ముఖ్యమైన మైలురాయిగా ఉంది. దర్శకుల ఫోర్ట్‌నైట్‌లో కరణ్ కంధారి రూపొందించిన ఉద్వేగభరితమైన ''సిస్టర్ మిడ్‌నైట్'' మరియు ఎల్‌సిడ్‌ట్రీట్‌లో మైసం అలీ "ఇన్ రీట్రీట్" ఉన్నాయి.

ఫిలిం అండ్ టెలివిజన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా (ఎఫ్‌టిఐఐ) విద్యార్థి చిత్రం "సన్‌ఫ్లవర్స్ వేర్ ఫస్ట్ ఒన్స్ టు నో" లా సినీఫ్ కాంపిటీటివ్ విభాగంలో ఎంపికైంది. కన్నడలో రూపొందించిన షార్ట్ ఫిల్మ్, ప్రపంచవ్యాప్తంగా ఎంట్రీలలో షార్ట్‌లిస్ట్ చేయబడింది మరియు ఇప్పుడు చివరి దశలో మరో 17 అంతర్జాతీయ షార్ట్ ఫిల్మ్‌లతో పోటీపడనుంది.

ఇంకా శ్యామ్‌బెనెగల్ యొక్క 'మంథన్', అమూల్ డెయిరీ కోఆపరేటివ్ ఉద్యమంపై దృష్టి సారించే చలనచిత్రం, పండుగ భారతీయ లైనప్‌కు చారిత్రక ప్రాముఖ్యతను జోడిస్తూ క్లాసిక్స్ విభాగంలో ప్రదర్శించబడుతుంది. ఫిల్మ్ రీల్స్ మంత్రిత్వ శాఖ యొక్క యూనిట్ అయిన ఎన్ఎఫ్‌డిసి-నేషనల్ ఫిల్మ్ ఆర్కైవ్ ఆఫ్ ఇండియా (ఎన్ఎఫ్ఏఐ) యొక్క ఫిల్మ్ వాల్ట్‌లలో అనేక దశాబ్దాలుగా భద్రపరచబడ్డాయి మరియు ఫిల్మ్ హెరిటేజ్ ఫౌండేషన్ (ఎఫ్‌హెచ్ఎం) ద్వారా పునరుద్ధరించబడింది.

జాతీయ అవార్డు గ్రహీత సినిమాటోగ్రాఫర్ సంతోష్ శివన్ కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ప్రతిష్ఠాత్మకమైన పియరీ ఏంజెనియక్స్ ట్రిబ్యూట్‌ను అందుకోనున్నారు. అతను కేన్స్ డెలిగేట్‌లకు మాస్టర్‌క్లాస్‌ను కూడా అందజేస్తారు. తద్వారా ఈ ఘనతను అందుకున్న మొదటి భారతీయుడుగా నిలవనున్నారు.

గోవా, మహారాష్ట్ర, జమ్మూ ఉ కాశ్మీర్, కర్నాటక, జార్ఖండ్ మరియు ఢిల్లీతో సహా అనేక భారతీయ రాష్ట్రాలు భారతదేశం యొక్క విభిన్న ప్రదేశాలు మరియు చలనచిత్ర ప్రతిభను ప్రదర్శించడంలో సహాయపడతాయి.

భారతదేశ సహకారంతో చలనచిత్ర నిర్మాణ అవకాశాలను అన్వేషించే సెషన్, "అబండెంట్ ఇన్సెంటివ్ అండ్ సీమ్‌లెస్ ఫెసిలిటీస్-కమ్, క్రియేట్ ఇన్ ఇండియా" పేరుతో మే 15వ తేదీ మధ్యాహ్నం 12 గంటలకు ప్రధాన వేదిక (రివేరా)లో నిర్వహించబడుతోంది. చలనచిత్ర నిర్మాణం, సహ నిర్మాణ అవకాశాలు మరియు అగ్రశ్రేణి పోస్ట్-ప్రొడక్షన్ సౌకర్యాల కోసం భారతదేశం అందిస్తున్న భారీ ప్రోత్సాహకాలను ప్యానెల్ చర్చ తెలియజేస్తుంది. అలాగే చిత్రనిర్మాతలు ఈ కార్యక్రమాలను ఎలా స్వాగతిస్తున్నారు, భారతదేశంలో చిత్రీకరణకు సంబంధించి వాస్తవ అనుభవాలు మరియు భాగస్వామ్యం చేయబడుతున్న ఉత్తేజకరమైన కథనాలు ఏమిటి అనే విషయాలను ప్యానెల్ ముందుకు తెస్తుంది.

చిత్రోత్సవంలో నిర్వహించబడే భారత్ పెవిలియన్‌లో ఇంటరాక్టివ్ సెషన్‌లు భారతదేశంలో రూపొందించడానికి ప్రోత్సాహకాలు, ఫిల్మ్ ఫెస్టివల్స్‌లో అంతర్జాతీయ సహకారం, చిత్రీకరణ గమ్యస్థానంగా భారతదేశం, భారతదేశం మరియు స్పెయిన్, యుకె మరియు ఫ్రాన్స్ వంటి దేశాల మధ్య ద్వైపాక్షిక చలనచిత్ర సహ-నిర్మాణాలు వంటి అంశాలను కవర్ చేస్తాయి. భారతీయ చలనచిత్ర పరిశ్రమ మరియు అంతర్జాతీయ భాగస్వాములతో నిమగ్నమవ్వాలని కోరుకునే చిత్రనిర్మాతలకు చర్చలు, నెట్‌వర్కింగ్ మరియు సహకార అవకాశాలను సులభతరం చేయడం ఈ సెషన్‌ల లక్ష్యం.

# ఎన్నికల విధులు నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు తప్పవు..

**-జిల్లా ఎన్నికల అధికారి/ జిల్లా కలెక్టర్ శ్రీమతి వల్లూరు క్రాంతి.**

సంగారెడ్డి మే 11(నేటి నిజం ప్రతినిధి) లోక సభ సార్వత్రిక ఎన్నికల విధులలో నియామకం కాబడిన ఉద్యోగులందరూ వారికి కేటాయించిన విధులను సక్రమంగా నిర్వర్తించాలని, ప్రిసైడింగ్ అధికారులు,అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు మరియు ఇతర పోలింగ్ అధికారులు కేటాయించబడిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల్లో ఉదయం 9.గంటల వరకు రిపోర్ట్ చేయాలని,రిజర్వ్ పోలింగ్ సిబ్బంది కూడా డిస్ట్రిబ్యూషన్ కేంద్రం లో అందుబాటులో ఉండాలని, ఈ విధుల్లో ఏ మాత్రం నిర్లక్ష్యం చేసినా కఠిన చర్యలు తప్పవని ×జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నిక ల అధికారి శ్రీమతి క్రాంతి వల్లూరు ఆదేశాలు జారీ చేశారు.

# మీ బిడ్డ గొంతు నొక్కేస్తున్నారు ... అధికారం కోసం అడుగుడునా కుట్రలే

**- చంద్రబాబుపై జగన్ ఆగ్రహం**




అమరావతి, మే 11 : ఏపీలో జరగబోయేది రెండు కులాల మధ్య యుద్ధం కాదని, రెండు సిద్ధాంతాల మధ్య యుద్ధం జరుగుతోందని ఏపీ సీఎం జగన్ మోహన్ రెడ్డి అన్నారు. పల్నాడు జిల్లా చిలకలూరిపేటలో శనివారం ఎన్నికల ప్రచారంలో టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు, జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ ను తూర్పారబట్టారు. చిలకలూరిపేటలో జనం పోటెత్తారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పేదవాడు ఒకవైపు? పెత్తందారు ఒకవైపు ఉన్నారన్నారు. అధికారం కోసం కుట్రలు పన్నుతున్నారని ప్రజలు గమనించాలన్నారు. రెండు నెలల కింద వరకూ అవ్వాతాతలకు పెన్షన్ ఇంటికే వచ్చేది.. దీని వల్ల ఎక్కడ మీ బిడ్డకు మంచి పేరు వస్తుందో అని పెన్షన్ ఆపేసి.. ఆ అవ్వాతాతల ఉసురు తగిలించుకున్నారు. అవినీతి, అక్రమాలు లేని, లంచాలు, వివక్ష లేని పాలనలో సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మీ బిడ్డ జగన్ కే ఓటు వేయాలన్నారు. పొరబాటున చంద్రబాబుకు ఓటు వేస్తే పథకాలన్నీ ముగింపుతో మోసపోతారని హెచ్చరించారు.

మీ బిడ్డ గొంతు నొక్కేస్తున్నారు

ఏ ప్రభుత్వమైన 60 నెలల కోసం ప్రజలు ఎన్నుకుంటారు. కానీ, 57 నెలలకే మీ బిడ్డ ప్రభుత్వం గొంతు నొక్కే ప్రయత్నం చేస్తున్నారని జగన్ ఆవేదన వ్యక్తం చేశారు. మీ బిడ్డ బటన్లు నొక్కిన సొమ్మును ఆ అక్కాచెల్లెమ్మలకు ఇవ్వకుండా ఢిల్లీతో కలిసి కుట్రలు చేస్తున్నారన్నారు. ఈ డబ్బంతా ఎన్నికలయ్యాక 14వ తేదీ ఇస్తారట.. ఇది కుట్ర కాదా.. అని ప్రశ్నించారు.

అంతా దుష్ప్రచారమే

ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్, రిజిస్ట్రేషన్ల మీద ఎంత దుష్ప్రచారం చేస్తున్నారో చూస్తున్నాం. ఇదే చంద్రబాబు వియ్యంకుడు బాలకృష్ణ విశాఖలో, దత్తపుత్రుడు ఏపీలో భూములు కొన్నారు.. మరి వీరికి ఒరిజినల్ ఇచ్చారా?. మరి జిరాక్స్ ఇచ్చారా? అని ప్రశ్నించారు. ఏపీలో 9 లక్షల మంది రిజిస్ట్రేషన్ చేయించారు. కానీ, చంద్రబాబు దుష్ప్రచారం ఏ స్థాయిలో ఉందో గమనించాలి అని సీఎం జగన్ కోరారు.

# ఎన్డీయే, ఇండియా కూటమి ఓడిపోతున్నాయి : మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి

హైదరాబాద్, మే 11 :పార్లమెంట్ ఎన్నికల్లో ఎన్డీయే, ఇండియా కూటమి రెండూ ఓటడిపోతున్నాయని మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి అన్నారు. భువనగిరిలో ఆయన శనివారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడే భాయ్.. ఛోటే భాయ్ కేసీఆర్‌పై చేసిన ఆరోపణల్లో ఏమాత్రం నిజం లేదన్నారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఏమీ చేయలేకపోయిందన్నారు.

చిన్నాచితక పార్టీలు, జిల్లా పరిమితమైన పార్టీలతో స్నేహబంధం కలుపులకునే పరిస్థితుల్లో ఉన్నాడంటే మోదీ ఓడిపోతున్నారన్నారు.ఈ రెండు కూటమిలో లేని ప్రాంతీయ పార్టీలే చక్రం తిప్పబో తున్నాయన్నారు. మోదీ, అమిత్‌షా మాటలు వారి స్థాయిని దిగజార్చేలా ఉన్నాయన్నారు.

రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా పనికి రాడని ప్రజలకు అర్థమైందని.. బడే భాయ్.. ఛోటే భాయ్ ఇద్దరు కలిసినా చిన్న మార్క్‌ను చూపించలేకపోయారన్నారు. ఛోటే భాయ్ రాష్ట్రంలో అధికారం వచ్చి ఆరోపణలు, అసత్యాలు తప్ప ఏమీ తేల్చలేకపోయారన్నారు. కాంగ్రెస్ కొత్త హామీల సంగతి పక్కన పెట్టిన.. పాత పథకాలను కొనసాగించే పరిస్థితి లేదన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో మెజార్టీ సీట్లు బీఆర్ఎస్ గెలవబోతుందన్నారు.

# శంకర్‌పల్లిలో.. బీఆర్ఎస్ నుండి బీజేపీలో చేరికలు..



హైదరాబాద్, మే 11 : ఓట్లకు సమయం దగ్గర పడింది ఇక మిగిలింది రెండు రోజులే.. ఈ సమయంలో శంకర్ పల్లిలో బీఆర్ఎస్ నేతలు బీజేపీలో చేరారు. శంకర్ పల్లి ఎంపీపీ ధర్మన్న గారి గోవర్ధన్ రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ మున్సిపాలిటీ వైస్ ప్రెసిడెంట్ దండు రామ్మోహన్, చందిప్ప ఎంపీటీసీ దయాకర్ రెడ్డి ఫతేపూర్ నాయకులు శంకర్ యాదగిరిరెడ్డి, జంగయ్య ప్రవీణ్, బీఆర్ఎస్ పార్టీ మాజీ మున్సిపాలిటి అధ్యక్షుడు శేఖర్ రెడ్డి బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా, బీజేపీ ప్రస్తుత చేవెళ్ల నియోజకవర్గ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్ రెడ్డి, కేఎస్ రత్నం సమక్షంలో వారికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

శంకర్ పల్లి మున్సిపాలిటీ, మండల పరిధిలో వారి అనుచరులు దాదాపు వెయ్యి మందితో వికారాబాద్ కేంద్రంలో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా కార్యక్రమంలో అందరూ పార్టీలో చేరారు. వీరి చేరికతో మండల పరిధిలో బీఆర్ఎస్ పార్టీ నామమాత్రంగా మిగిలిపోయిన పరిస్థితి నెలకొంది. గోవర్ధన్ రెడ్డి అనుచరుల చేరికతో తమకు కొండంత బలం చేకూరినట్లు అయిందని మరింత ఉత్సాహంగా పనిచేసే ఈ ప్రాంత ప్రజల మనసుల్లో శాశ్వతంగా నిలబడి పోయేటట్లు పనిచేస్తామని భారతీయ జనతా పార్టీ నాయకులు రాములు గౌడ్, వాసుదేవ్, ప్రతాప్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, తదితరులు అభిప్రాయపడ్డారు.

# పోలింగ్ వేళ ... ప్రైవేటు దోపిడి...గగ్గోలు పెడుతున్న జనం

**-ఏపికి పయనమవుతున్న సెటిలర్స్**
**-ఓటింగ్ కోసం స్వంత గ్రామాలకు పయనం**
**-ఆర్టీసీ, రైళ్లు ఫుల్ స్పెషల్స్ లో సైతం నిండుగా జనం**
**-దోపిడీకి తెరలేపిన ప్రైవేట్ ట్రావెల్స్**
**-విజయవాడకే రెండు వేలు పై మాటే**
**-స్లీపర్ అయితే అయిదు వేలు కట్టాల్సిందే**
**-విశాఖలకు అయిదు వేలు, శ్రీకాకుళానికి ఏడు వేలు**
**-ఇక కడప, కర్నూలు, చిత్తూరులకు పది రెట్ల వసూళ్లు**
**-అందుబాటులోకి వచ్చిన విమాన సర్వీసులు**
**-మరో రెండు వేల బస్సులు నడపనున్న ఆర్టీసీ**

హైదరాబాద్, మే 11 :తెలుగు రాష్ట్రాల్లో ఎన్నికల సమరం తుది దశకు చేరుకుంది. ఇవాళ్టితో ప్రచారానికి తెర పడనుంది. మరో రెండు రోజుల్లో అంటే మే 13న పోలింగ్ జరుగుతుంది. ఎన్నికల వేళ ప్రైవేట్ ట్రావెల్స్ రెచ్చిపోతున్నాయి. ప్రయాణికులను అడ్డంగా దోచేస్తున్నాయి. ఉద్యోగాలు, చదువుల పేరుతో ప్రజలు సొంత ఊర్లకు దూరంగా ఎక్కడెక్కడో సెటిల్ అయిన జనాలు.. సొంత ఊర్లకు పయనం అవుతున్నారు. నేటి నుంచి సోమవారం వరకు వరుసగా సెలవులు ఉండటంతో.. ఓటేయడం కోసం తమ ప్రాంతాలకు వెళ్తున్నారు. ఆర్టీసీ బస్సులు, రైళ్లు ఫుల్ అయిపోయాయి. దీంతో.. ప్రైవేట్ ట్రావెల్స్‌ను ఆశ్రయించాల్సి వస్తోంది. దొరికిందే ఛాన్స్ అన్నట్లుగా ప్రైవేట్ ట్రావెల్స్ జనాలను పీల్చి పిప్పి చేస్తున్నాయి.

హైదరాబాద్ నుంచి ఏపీలోని ప్రధాన నగరాలకు ప్రైవేట్ ట్రావెల్స్ బస్సుల్లో టికెట్ రేట్లు చూస్తే మైండ్ బ్లాంక్ అవడం గ్యారెంటీ. మామూలు రోజుల్లో సొంత ఊర్లకు వెళ్లాలంటే.. 500నుంచి వేయి రూపాయలు అవుతుంది.

కానీ.. ఇప్పుడు మాత్రం ఏకంగా మూడు, నాలుగు రెట్లు పెంచేసాయి ప్రైవేట్ ట్రావెల్స్. అంటే.. వెయ్యి రూపాయలు అయ్యే చోట ఇప్పుడు ఏకంగా 5 వేల రూపాయలు ఖర్చు చేయాల్సి వస్తోంది. ఓ కుటుంబం నుంచి ఇద్దరు ఊరికి వెళ్లి ఓటు వేసి రావాలంటే.. 10 నుంచి 15 వేలు ఖర్చవుతోంది.

ప్రస్తుతం ప్రైవేట్ ట్రావెల్స్ బస్సుల్లో స్లీపర్ బస్సుల్లో హైదరాబాద్ నుంచి విజయవాడ టికెట్ రేట్లు 2500 నుంచి 5 వేల వరకూ చూపిస్తున్నాయి. హైదరాబాద్ నుంచి కడప, విశాఖపట్నం, రాజమండ్రి, తిరుపతిలాంటి ప్రధాన నగరాలకు కూడా ఇదే రేంజులో టికెట్ రేట్లు ఉన్నాయి. దీంతో ప్రైవేట్ ట్రావెల్స్ తీరుపై జనాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఏపీ ప్రయాణికులు సొంతూళ్లకు వెళ్తుండటంతో.. సిటీలోని అన్ని ప్రాంతాలూ బస్సులతో రద్దీగా మారాయి. బీహెచ్ఈఎల్, మియాపూర్, కూకట్‌పల్లి, ఎల్బీనగర్ ప్రాంతాల్లో భారీగా ట్రాఫిక్ జాం ఏర్పడింది.

## అదనంగా రెండు వేల ఆర్టీసీ బస్సులు..

మరోవైపు ప్రయాణికుల రద్దీని దృష్టిలోఉంచుకొని దక్షిణ మధ్య రైల్వే కీలక నిర్ణయం తీసుకుంది. తెలుగు రాష్ట్రాల మధ్య సర్వీసులందించే దాదాపు 20కి పైగా రైళ్లకు తాత్కాలికంగా అదనపు కోచ్‌లను ఏర్పాటుచేసింది. దీంతో వెయిటింగ్ లిస్ట్‌లో ఉన్న ప్రయాణికులకు కొంత ఉపశమనం కలగనుంది. ఇక ఆర్టీసి ప్రస్తుతం నడుపుతున్న బస్సులకు గాను అదనంగా రెండు వేల బస్సులను నాలుగు రోజుల పాటు నడపనున్నట్లు ప్రకటించింది..

## అందుబాటులో విమానాలు

ఎపి వెళ్లే ప్రజల కోసం విమాన సంస్థలు తమ వంతు అదనపు సర్వీస్‌లను నడుపుతున్నాయి.. విజయవాడ, తిరుపతి, విశాఖపట్నం, రాజమండ్రిలకు విమానాలను అందుబాటులోకి తెచ్చాయి.. విజయవాడ, తిరుపతిలకు ఎనిమిది వేలు ఉండగా, విశాఖకు సైతం తొమ్మిది వేలు చార్జీలను వసూలు చేస్తున్నారు? ఆయా ప్రాంతాలకు వెళ్లేందుకు కేవలం గంట సమయం కావడంతో ఐటి ఉద్యోగుల అధిక సంఖ్యలో విమాన ప్రయాణాన్ని ఆశ్రయిస్తున్నారు..

# మెదక్ పార్లమెంటు భరోసా అభ్యర్థి వెంకట్రామిరెడ్డి ని భారీ మెజారిటీతో గెలిపించాలి.

**-సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్.**

సంగారెడ్డి, మే 11 :(నేటినిజం ప్రతినిధి ): ఈనెల 13వ తేదిన



పార్లమెంట్ ఎన్నికలు నిర్వహించబడుతునందున, సంగారెడ్డి నియోజకవర్గం లోని ఓటర్లందరూ మెదక్ పార్లమెంటు భారాస అభ్యర్థి వెంకట్ రామ్ రెడ్డి కారు గుర్తుకు ఓట్లు వేయాలని సంగారెడ్డి నియోజకవర్గం శాసనసభ్యులు చింతా ప్రభాకర్ కోరారు. శనివారం నాడు సంగారెడ్డిలోని రెడ్లాన్ హోటల్లో విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చింత ప్రభాకర్ మాట్లాడుతూ ఎన్నో త్యాగాలకోర్చి పోరాటం చేస్తేనే తెలంగాణ రాష్ట్రం సాధ్యమైంది, బి ఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు బంగారు తెలంగాణ అభివృద్ధి దిశగా దేశంలోనే నంనంపన్నమైన రాష్ట్రంగా తీర్చిదిద్దారన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎన్నో వాగ్దానాలు చేసి ఒక్క వాగ్దానం కూడా నెరవేర్చకుండా ప్రజలను మోసం చేస్తున్నారని అన్నారు. పేద ప్రజల కోసం ఫంక్షన్ హాల్ నిర్మాణం కొరకు తాము కూడా సిద్ధమేనని చెప్పారు. పేదలందరికీ ఒక్క రూపాయికి ఆ ఫంక్షన్ హాలు కార్యక్రమాలు నిర్వహించుకోవడానికి నియోజకవర్గ పేదలకు అందించేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు. కాంగ్రెస్ నాయకుల కల్లబొల్లి మాటల ను నమ్మవద్దని ప్రజా సంక్షేమానికి పాటుపడే బి ఆర్ ఎస్ పార్టీ నీ గుర్తుపెట్టుకుని కారు గుర్తుపై ఓటు వేసి భారస అభ్యర్థి వెంకటరామిరెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఎమ్మెల్యే చింత ప్రభాకర్ సంగారెడ్డి నియోజకవర్గ ఓటర్లను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు కాసాల బుచ్చిరెడ్డి ,నరహరి రెడ్డి, నాగరాజ్, డాక్టర్ శ్రీహరి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల ప్రచారంలో బీఆర్ఎస్‌కి అనూహ్య స్పందన : కరీంనగర్ అభ్యర్థి వినోద్‌కుమార్



హైదరాబాద్, మే 11 :రెండు నెలల పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో బీఆర్ఎస్‌కి అనూహ్య స్పందన వచ్చిందని.. గ్రామీణ ప్రాంతాల్లో మళ్లీ గులాబీ జెండా పట్టం కట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని బోయినపల్లి వినోద్ కుమార్ అన్నారు. ఎమ్మెల్యే గంగుల కమలాకర్‌తో కలిసి శనివారం మీడియా సమావేశం నిర్వహించారు. పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, ఏడు నియోజకవర్గాల్లో జోరుగా ప్రచారం చేయడం జరిగిందన్నారు. ఈ సారి కరీంనగర్ ప్రజలు తనను ఎంపీగా ఆశీర్వదించబోతున్నారన్నారు. కాంగ్రెస్ ఐదునెలల పాలనలో గ్రామీణ వ్యవస్థ విధ్వంసమైందని.. ప్రజలు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారన్నారు. తెలంగాణలో సాగునీటి సమస్య, కరెంటు కోతలు, మోటార్లు, ట్రాన్స్‌ఫార్మర్లు కాలడం మొదలైందన్నారు. కాంగ్రెస్ మార్పు తెస్తామని చెప్పి.. కాంగ్రెస్ పార్టీ నట్టేట ముంచిందన్నారు.

పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో కరెంటు మోటర్, ఒక్క ట్రాన్స్‌ఫార్మర్ కూడా కాలిపోలేదని.. దాంతో తెలంగాణవ్యాప్తంగా ప్రజల్లో మళ్లీ కేసీఆర్ రావాలనే ఆకాంక్ష మొదైలం దన్నారు. మళ్లీ రాష్ట్రం సుభిక్షంగా ఉండాలంటే కారు.. కేసీఆర్ రావాలని ప్రజలు కోరుకుంటున్నారన్నారు. తెలంగాణలో మెజార్టీ స్థానాల్లో జూన్ 4న గులాబీ జెండానే మళ్లీ ఎగురుతుందని.. ఎంపీగా తాను భారీ మెజారిటీతో గెలుస్తానని వినోద్ ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పాలనలో కరీంనగర్ కేబుల్ వంతెనపై లైట్లు వెలగని పరిస్థితి ఉందన్నారు. మానేరు రివర్ ఫ్రంట్‌ని పట్టించుకోకుండా కాలికి వదిలేశారని.. ప్రజలకు అభివృద్ధి కావాలో.. విధ్వంసం కావాలో తేల్చుకోవాలన్నారు. ఉమ్మడి రాజధాని హైదరాబాద్‌కి జూన్ 2తో సమయం అయిపోతుందని? ఆంధ్రప్రదేశ్ ఎన్నికల్లో టీడీపీ కూటమి గెలిస్తే చంద్రబాబునాయుడు రేవంత్ రెడ్డి కలిసి హైదరాబాద్‌ని ఉమ్మడి రాజధానిగా కుట్రలు చేసి ఆగం చేస్తారన్నారు.

కరీంనగర్ బీజేపీ ఎంపీ బండి సంజయ్ ఐదేళ్లలో ఒక్క అభివృద్ధి పని కూడా చేయలేదని.. కరీంనగర్‌లో అభివృద్ధి చేయలేక, అభ్యర్థి ఫొటో లేకుండా మోదీ ఫొటో పెట్టి బండి సంజయ్ ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. బొమ్మ లేకుండా దేశంలో ఎక్కడా ప్రచారం చూడలేదని.. మోదీ ప్రధానిగా ఉన్న పదేళ్ల కాలంలో తెలంగాణ హక్కుల కోసం కరీంనగర్ అభివృద్ధి కోసం మోదీతో పాటు కేంద్రమంత్రుల దగ్గరికి చాలాసార్లు వెళ్లినట్లు వినోద్ కుమార్ గుర్తు చేశారు. ఎంపీగా గెలిచిన బండి సంజయ్ పార్టీ సమావేశాల్లో మాత్రమే మోదీని కలిశారని ఏ నాడు కూడా ఆలయాలకు.. అభివృద్ధి పనుల కోసం నిధులు అడగలేదన్నారు. ప్రజా సమస్యలను గాలికొదిలి.. పార్టీ మీటింగ్‌లకే బండి పరిమితమయ్యారన్నారు.

ఎప్పుడూ మతం, ధర్మం అని మాట్లాడే బండి సంజయ్ ఎన్నడూ తన పని సక్రమంగా నిర్వర్తించలేద.. బండికి మత విద్వేషాలు తప్ప అభివృద్ధి చేయడం, ప్రజలను గౌరవించడం తెలియదని అన్నారు. మోదీ ఖమ్మంలోని ఏడు మండలాలను ఆంధ్రాలో కలిపాడని అన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని, హైదరాబాద్‌ని కాపాడుకోవాలంటే కరీంనగర్‌లో ఎంపీగా ప్రజలు ఆశీర్వదించి తనను పార్లమెంట్‌కి పంపాలని అన్నారు. కేంద్రంలో ఏ ప్రభుత్వం ఉన్నా నిధులు తెచ్చి.. అభివృద్ధి చేసి చూపిస్తానని వెల్లడించారు. వేములవాడకు ఎన్నికల ప్రచారానికి వచ్చిన మోదీ రాజన్న ఆలయానికి నిధులు కేటాయించపోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. రాజన్న ఆలయానికి నిధులు కేటాయించడానికి హామీ ఇవ్వడానికి.. ఎన్నికల కోడ్‌కు ఏం సంబంధమని ప్రశ్నించారు. బండి సంజయ్ ఇంకెన్ని రోజులు ప్రజలను మభ్యపెడతారన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బండికి ఓటమి తప్పదని ప్రజలు అభివృద్ధికి ఓటు వేసేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు.




# కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఏపీకి రెండు రోజుల్లో ప్రత్యేక హోదా : రాహుల్ గాంధీ

అమరావతి, మే 11 : కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే రెండు రోజుల్లో ప్రత్యేక హోదాను కల్పిస్తామని కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ పేర్కొన్నారు. కడపలో పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తరుపున నిర్వహించిన ప్రచార బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. ఏపీకి పది సంవత్సరాల పాటు ప్రత్యేక హోదాను కల్పిస్తామని వెల్లడించారు. పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసి రైతాంగానికి నీరందిస్తామని, కడప స్టీల్ ప్లాంట్‌ను పునరుద్ధరిస్తామని ప్రకటించారు.

ఏపీకి చెందిన గత ప్రభుత్వాలు మోదీ వద్ద మోకరిల్లడం వల్లే ప్రత్యేక హోదా , పోలవరం, కడప స్టీల్ ప్లాంట్ రాలేదని ఆరోపించారు. రాజీవ్‌గాంధీ, రాజశేఖర్‌రెడ అన్నద మ్ముల్లా ఉండేవారని వెల్లడించారు. వైఎస్సార్ ఏపీకే కాదు. మొత్తం దేశానికే దారి చూపించారని కొనియాడారు. వైఎస్సార్ తండ్రిలా నాకు మార్గదర్శనం చేశారని, పాదయాత్రల ద్వారానే ప్రజల సమస్యలు తెలుస్తాయని చెప్పారని వివరించారు. భారత్ జోడో యాత్రకు వైఎస్సార్ పాదయాత్రే స్ఫూర్తిని తెలిపారు.

వైఎస్సార్ పేరును ఛార్జ్‌షీట్‌లో కాంగ్రెస్ పెట్టిందని చేస్తున్న ప్రచారంలో వాస్తవం లేదని స్పష్టం చేశారు. ఎవరో తమ స్వార్థం కోసం కడపలోని ఇడుపులపాయ వద్ద దివంగత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సమాధి వద్ద రాహుల్ గాంధీ, షర్మిల నివాళి అర్పించారు.

# చివరి మీటింగ్‌లో జగన్ దుమ్ముదులిపేసిన చంద్రబాబు

చిత్తూరు, మే 11 తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు ఈ ఎన్నికల్లో తన చివరి ప్రచార సభను చిత్తూరులో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ, చిత్తూరు పార్లమెంటు అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాదరావు చదువుకున్న వ్యక్తి. ఇన్ కమ్ టాక్స్ ఆఫీసర్ గా పనిచేసి సమాజం కోసం రాజకీయాల్లోకి వచ్చారని వివరించారు.

చిత్తూరు అసెంబ్లీ స్థానం నుంచి టీడీపీ అభ్యర్థిగా జగన్ మోహన్ పోటీ చేస్తున్నారు? తక్కువ సమయంలో బుల్లెట్ మాదిరి దూసుకుపోయాడని కొనియాడారు. చిత్తూరులో గెలుపు జగన్ మోహన్ దేనని ధీమా వ్యక్తం చేశారు. మొదట్లో తనకు సందేహం కలిగిందని, మనవాడు ముందుకు పోగలడా అనుకున్నానని, కానీ పేరును అనౌన్స్ చేశాక అందరినీ కలుపుకుని కురుక్షేత్ర యుద్ధానికి సిద్ధమైపోయాడని అభినందించారు. కౌరవ వధ తప్పదని హెచ్చరించారు. ముఖ్యమంత్రి ఇక్కడ ఎలాంటి బ్రహ్మాండమైన నాయకుడ్ని పెట్టాడో తర్వాత మాట్లాడతానని చంద్రబాబు పేర్కొన్నారు. ఈ సందర్భంగా పూతలపట్టు టీడీపీ అభ్యర్థి, తిరుపతి అసెంబ్లీ స్థానం జనసేన అభ్యర్థి ఆరణి శ్రీనివాసులును కూడా చంద్రబాబు ప్రత్యేకంగా ప్రస్తావించారు.

సీనియర్ నేత సీకే బాబు గురించి చంద్రబాబు ప్రత్యేకంగా మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే సీకే బాబుకు చిత్తూరులో తనకంటూ ప్రత్యేకత ఉందని అన్నారు. ఎవరైనా అడ్డొస్తే తొక్కుకుంటూ పోతాం అని హెచ్చరించారు. చిత్తూరు నుంచి జగన్ మోహన్ ను గెలిపిస్తానని ఎంతో ఉత్సాహంగా ముందుకొచ్చిన వ్యక్తి సీకే బాబు అని కొనియాడారు.

"ఇది నా జిల్లా. నేను పుట్టిన జిల్లా. ఎన్నికల కోసం రాష్ట్రమంతా తిరిగా? చివరి మీటింగ్ ను ఇక్కడే పెట్టాలని అనుకున్నా. రాష్ట్రం మొత్తానికి నేను చెప్పాలనుకున్నది ఇక్కడ్నించే చెబుతాను. నాకు రాజకీయ జన్మనిచ్చిన జిల్లా ఇది, రాజకీయాల్లో ఓనమాలు నేర్పించిన జిల్లా ఇది. చిత్తూరు జిల్లా ప్రజల గౌరవాన్ని కాపాడేందుకు అనునిత్యం పనిచేశాను.

ఇవాళ నంద్యాలలో కూడా మీటింగ్ పెట్టాను. నన్ను ఎక్కడైతే అరెస్ట్ చేశారో అక్కడ మీటింగ్ పెట్టాను. ఏ తప్పు చేయని నన్ను అరెస్ట్ చేశారు. నాకే ఈ పరిస్థితి వస్తే, సామాన్యుల పరిస్థితేంటి? అందుకే సైకో పోవాలి, సైకిల్ రావాలి. ఈ జిల్లాలో ఎవర్ని చూసినా నేను గుర్తుపట్టగలను. మీ రుణం తీర్చుకుంటా.

జిల్లాలో పరిశ్రమలు పెట్టించాను, సాగునీరు అందించేందుకు కృషి చేశాను. ఈ జిల్లా వాసులను అగ్రస్థానంలో నిలిపేందుకు నా జీవితాంతం పనిచేశాను. చిత్తూరు జిల్లాలో పరిశ్రమలు రావాలని తిరుపతిని ఎలక్ట్రానిక్ హబ్ గా మార్చాం. ఎక్కడైనా అభివృద్ధికి మారుపేరు టీడీపీ? అవినీతికి మారుపేరు సైకో పాలన!

ఇక్కడ రోడ్లు ఎవరి వల్ల వచ్చాయి? నేను మొదట మలేషియాలో రోడ్లు చూసి, మనదేశంలోనూ మంచి రోడ్లు ఉండాలని నాటి ప్రధాని వాజ్ పేయికి చెప్పి తొలిరోడ్డు నెల్లూరు నుంచి చెన్నైకి వేసేలా కృషి చేశాను. ఇప్పుడు దేశమంతా ఎక్స్ ప్రెస్ లేన్ రోడ్లు వచ్చాయంటే అది టీడీపీ వల్లే. మీరందరూ వాడే సెల్ ఫోన్లు తీసుకురావడానికి నేనే కారణం. గత 30 ఏళ్లుగా టెక్నాలజీ గురించి మాట్లాడుతున్నాను. ఒకప్పుడు సెల్ ఫోన్ తిండిపెడుతుందా అని నన్ను ఎగతాళి చేశారు. ఇప్పుడు భర్త లేకుండా భార్య ఉంటుంది, భార్య లేకపోయినా భర్త ఉంటాడు కానీ సెల్ ఫోన్ లేకుండా ఎవరూ ఉండలేరు. ఇప్పుడు పేదవాళ్ల దగ్గర కూడా సెల్ ఫోన్లు ఉన్నాయి.

ఇవన్నీ ఉంటే సరిపోదు.. సాగునీరు కూడా ఉండాలి. సాగునీటి ప్రాధాన్యతను గుర్తించిన వ్యక్తి ఎన్టీఆర్. తెలుగుగంగ, నగరి-గాలేరు, హంద్రీనీవా ఇవన్నీ ఎన్టీఆర్ ఆలోచనలే. నేనొచ్చిన తర్వాత రూ.65 వేల కోట్లతో అన్ని ప్రాజెక్టులు పూర్తి చేశాను.

నిన్నా మొన్నా వచ్చాడు సినిమా సెట్టింగులు గాడు ముఖ్యమంత్రి! నేరుగా కుప్పం పోయాడు, గేట్లు పెట్టాడు, ట్యాంకర్లలో నీళ్లు తెచ్చి పోసి గేట్లు ఓపెన్ చేశారు. ఈయన విమానం ఎక్కి వెళ్లిపోయాడు నీళ్లు ఆరిపోయాయి, గేట్లు ఎత్తుకెళ్లిపోయారు. ఇదేనా అభివృద్ధి ఇలాంటి మోసకారి మనకు అవసరమా

నేను అధికారంలోకి రాగానే చిత్తూరు జిల్లాలో నీటి ఎద్దడి లేకుండా, ప్రతి ఎకరాకు నీళ్లు ఇస్తా. ఇవాళ నంద్యాలలో కూడా చెప్పా నేను కూడా రాయలసీమ బిడ్డనే, ఈ గడ్డమీదనే పుట్టా. ఇప్పుడు సవాల్ విసురుతున్నా రాయలసీమకు ఎవరేం చేశారో చర్చించడానికి సిద్ధమా? గత ఎన్నికల్లో రాయలసీమలో 52 సీట్లలో 3 సీట్లే మాకు వచ్చాయి.. వైసీపీని 49 సీట్లలో గెలిపించారు. మరి ఏమైనా చేశాడా సాగునీరు తెచ్చాడా కాలేజీలు తెచ్చాడా రోడ్లు వేశాడా మీ జీవన ప్రమాణాలు పెరిగాయా

పాదయాత్ర చేసి ఒక్క చాన్స్ అన్నాడు. ప్రజలు ఐస్ మాదిరిగా కరిగిపోయారు. 151 సీట్లలో గెలిచేసరికి కొవ్వెక్కి, కళ్లు నెత్తికెక్కాయి... ఎదురుమాట్లాడితే వాళ్లపై దాడులు, కేసులు! పోలీస్ వ్యవస్థను భ్రష్టు పట్టించాడు. చిత్తూరు జిల్లాలో కార్పొరేషన్ ఎన్నికల్లో రిగ్గింగ్ జరుగుతుంటే, ఇక్కడికి ప్రజలకు నేను భరోసా ఇవ్వాలనుకున్నాను. కానీ, నన్ను ఎయిర్ పోర్టు నుంచి తిప్పి పంపించారు. మర్చిపోతానా ఇవన్నీ నాకు రోషం లేదనుకుంటున్నారా నేను తలుచుకుంటే మీరు రోడ్ల మీదకు కూడా రాలేరు.

ఇక్కడొకాయన ఉన్నాడు పాపాల పెద్దిరెడ్డి. ఈ జిల్లాలో చూస్తే పదవులన్నీ ఆయనకే కావాలి. ఎంపీ ఆయన కొడుకే, ఎమ్మెల్యే ఆయన తమ్ముడే, మంత్రి పదవి ఆయనకే, కాంట్రాక్టులన్నీ ఆయనకే. ఇరిగేషన్ కాంట్రాక్టులు కూడా ఈయనకే. ఈ రాష్ట్రం వీళ్లబ్బ సొమ్ము అనుకుంటున్నారు. మెక్కిందంతా మక్కెలు విరగ్గొట్టి వసూలు చేస్తా, పేదల కోసం ఖర్చు చేస్తా.

ఇక్కడ ఎమ్మెల్యే ఎవరు.. ఎర్రచందనం స్మగ్లర్.. జైల్లో ఉండాల్సిన వ్యక్తి. నేను అనుకుంటే ఎప్పుడో ఎక్కడికో పోయేవాడు.. ఏం తమాషా అనుకుంటున్నావా, ఇక్కడ అందరినీ బెదిరిస్తావా..

ఈ ఐదేళ్లలో రాష్ట్రం ఎంత నష్టపోయిందో ప్రజలంతా ఆలోచించాలి. జరిగిన దానికి కసి తీర్చుకోవాలని ప్రజల్లో తిరుగుబాటు కనిపిస్తోంది. గత 40 రోజులుగా నేను ప్రచారం చేస్తున్నాను.. ఇది 89వ సభ. ఎవరూ ఇన్ని సభలు చేసి ఉండరు. ఎక్కడి చూసినా ఇదే స్పందన, ఇదే ఉత్సాహం చూస్తున్నా. యువత, మహిళలు, చిరు వ్యాపారులు, ఉద్యోగులు అందరూ రోడ్లపైకి వచ్చారు.

జగన్ పాలనలో బాగుపడింది ఐదుగురే. పాపాల పెద్దిరెడ్డి, ఏ2 విజయసాయిరెడ్డి, సజ్జల రెడ్డి, సుబ్బారెడ్డి, జగన్ మోహన్ రెడ్డి... వీళ్లు తప్ప ఎవరైనా బాగుపడ్డారా రైతుల్లో రెడ్లు, కమ్మవాళ్లు, బలిజలు అందరూ ఉన్నారు.. ఎవరైనా బాగుపడ్డారా.. జగన్ దోపిడీకి అందరూ బలైపోయారు.

అందుకే నేను, పవర్ స్టార్ పవన్ కల్యాణ్ ముందుకొచ్చాం. పవన్ సినిమాల్లోనే కాదు నిజ జీవితంలో కూడా హీరో. ప్రజలను ఆదుకోవాలని ముందుకు రావడమే కాదు, ఎలాంటి త్యాగాలకైనా సిద్ధపడ్డాడు. నేను, ఆయన బీజేపీ ముగ్గురం కలిశాం. ప్రజలు గెలవాలని, రాష్ట్రం వెలగాలని కలిశాం. నేను జైల్లో ఉంటే వచ్చి, రాష్ట్రంలో ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలకూడదని చెప్పి, పొత్తు పెట్టుకుంటున్నాం అని ప్రకటించిన వ్యక్తి పవన్ కల్యాణ్'' అంటూ చంద్రబాబు ప్రసంగించారు.

# ప్రజాస్వామ్యాన్ని పాతరేసే బిజేపీని ఓడించాలి

**-రాజన్న అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక**

**-ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**

రాజన్న సిరిసిల్ల, 11 :(నేటినిజం ప్రతినిధి): వేములవాడ పట్టణంలో కోరుట్ల బస్టాండ్ వద్ద, భగవంతరావు నగర్, తిప్పపూర్, నాంపల్లి , శాత్రాజ్ పల్లి, గాంధీనగర్ లో కరీంనగర్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వెలిచాల రాజేందర్ రావుకు మద్దతుగా ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ కార్నర్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్రంలో పది సంవత్సరాల బిఆర్ఎస్ ను పక్కన పెట్టినట్లుగా బిజేపీ నీ కూడా పక్కన పెట్టాలన్నారు.

13వ తేదీన వెలిచాల రాజేందర్ రావును ఎంపిగా గెలిపించాలని కోరారు.

ఒకసారి వినోద్ కుమార్ కు అవకాశం ఇచ్చారని, ఒకసారి బండి సంజయ్ కు అవకాశం ఇచ్చారని,

ఈసారి వెలిచాల రాజేందర్ రావుకు ఒక్క అవకాశం ఇవ్వాలన్నారు.

రాజేందర్ రావు గెలిస్తే మేము ఇద్దరం జోడెడ్ల లాగా పనిచేస్తూ నియోజకవర్గన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్తాం అన్నారు. వేములవాడ పట్టణంలో 34 కుల సంఘ భవనాలకు నిధులు ఇచ్చాం అన్నారు.

కెసిఆర్ నా లగ్గం ఇక్కడే అయ్యిందని, రాజన్న కు ఏటా వంద కోట్ల రూపాయలు ఇస్తానని మోసం చేశారని గుర్తు చేశారు. గతంలో మాజీ ముఖ్యమంత్రి కేసిఆర్ వీటీడీఏ చైర్మన్గా ఉండి ఒక్క సమావేశం కూడా నిర్వహించలేదని,

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో వీటీడీఏ సమావేశం నిర్వహించాం అన్నారు.

గతంలోని వెళ్లిపోయిన ఇక మళ్ళీ రావని అనుకున్న 20 కోట్ల నిధులను దేవాలయ అభివృద్ధికి తీసుకొచ్చాం అని,

బద్ది పోచమ్మ,రాజన్న దేవాలయ



అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం అన్నారు.

16 ప్రధాన కాలువ ద్వారా గుడి చెరువులోకి మురుగు నీరు కలుస్తుందని, గుడి చెరువులోకి, మూల వాగులోకి మురికి నీరు పోకుండా ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తున్నాం అన్నారు. గతంలో కేటీఆర్ నాంపల్లి గుట్టకి రోప్ వే హామీ ఏమయిందని,

మొన్నటి రోజు వేములవాడ రాజన్న దేశ ప్రధాని మోడీ దర్శించుకుంటే నిధులు ఇస్తామని ఆశపడ్డాం అన్నారు. ఉత్తర కాశీలో పోటీ చేసి గెలిచిన మోడి దక్షణ కాశీ వేములవాడ రాజన్న సన్నిధికి వస్తె గుడి అభివృద్ధి కోసం నిధులు ఇస్తాడు అనుకుంటే ఉట్టి చేతులతో వెళ్ళాడని పేర్కొన్నారు. మన రాజన్నకీ ఎం ఎవ్వని మోడి మన ప్రజలకు ఏం ఇస్తాడని, కేంద్రంలో ప్రసాద్ పథకం ద్వారా అయిన ఇవ్వనీ బిజేపీ వారికీ ఓటు ద్వారా బుద్ధి చెబుదాం అని అన్నారు. బిజేపీ పాలనల దేశంలోని అన్ని వర్గాల ప్రజలకు ఆన్యాయం చేశారన్నారు. అధికారంలోకి రాక ముందు మోడి నల్ల ధనం తెచ్చి పేదవారి ఖాతాల్లో 15లక్షల ఇస్త అనీ రైతలకు నల్లా చట్టాలు తెచ్చారని,

నిరుద్యోగులకు ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని నిరుద్యోగ యువతను మోసం చేశారని అన్నారు.

బీజేపి వారు 400 సీట్లు ఇవ్వాలని అంటున్నారని, బిసి ఎస్సీ ఎస్టీ ల రిజర్వేషన్లను ఎత్తివేసే కుట్రలో భాగంగా 400 సీట్లు అడుగుతున్నారని తెలిపారు. బీజేపినీ గెలిపిస్తే రాజ్యాంగం రద్దు చేస్తారని,

ఆర్ఎస్ఎస్ చిప్ మోహన్ భగత్ రిజర్వేషన్ లేని దేశం కావాలి అంటున్నారని పేర్కొన్నారు.

రిజర్వేషన్లు, రాజ్యాంగం ఉండాలంటే కాంగ్రెస్ పార్టీ అధికాంలోకి రావాలని,

నిన్నటి రోజు మాజీ సీఎం కెసిఆర్ సిరిసిల్లకి వచ్చారని, అధికారంలో వున్నపుడు ఎందుకు రాలేదని ప్రశ్నించారు. కెసిఆర్ కు అధికారం పోగానే ప్రజలు గుర్తుకు వచ్చి బస్సు యాత్ర పేరుతో వస్తున్నారని, రాష్ట్రంలో బిఆర్ఎస్ పార్టీకి ఒక్క ఎంపి సీటు కూడా వచ్చే అవకాశం లేదన్నారు.

గత ఎన్నికల్లో చెప్పినట్లు గానే రాష్టంలో పథకాలను అమలు చేస్తున్నాం అని,

కేసిఆర్ డబుల్ బెడ్ రూం పెరిట మోసం చేశారని అన్నారు. కెసిఆర్ తెలంగాణ రాష్ట్రన్ని అప్పుల కుప్పగా మార్చిన మీ ఆశీస్సులతో అధికారంలోకి రాగానే మహిళా తల్లులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించాం అన్నారు.

ఆరోగ్య శ్రీ పరిమితి 10 లక్షల వరకు పెంచుకున్నం అని, గతంలో రైతులకు ఉచిత కరెంటు ఇచ్చామని,

నేడు గృహాలకు ఉచిత విద్యుత్ అందజేస్తున్నం అన్నారు. 500 కే సిలిండర్ ఇస్తున్నాం అని, నియోజక వర్గం పరిధిలో 3500 ఇండ్లు మంజూరి అయ్యాయని పేర్కొన్నారు .ఆగస్ట్ 15 లోపు రైతులకు 2 లక్షల వరకు రుణ మాఫీ చేస్తాం అని, బండి సంజయ్ మన ప్రాంతానికి చేసింది ఏమీ లేదన్నారు. బిజేపి వారు దేవుడి పేరుతో రాజకీయం చేస్తున్నారని, రాముడి అక్షింతలతో కూడా రాజకీయం చేస్తున్నారని పేర్కొన్నారు. అక్షింతలు కళ్యాణం తర్వాత, విగ్రహ ప్రతిష్టావన తర్వాత పంచుతారు కని బిజేపి వారు ఓట్ల కోసమే నెల ముందు పంచారని తెలిపారు. ఎంపీ అభ్యర్థి వెలిచాల రాజేందర్ కాంగ్రెస్ పార్టీ చేతు గుర్తుకు ఓటు వేసి భారీ మెజారిటితో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ బింగి మహేష్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు చంద్రగిరి శ్రీనివాస్ గౌడ్, కాంగ్రెస్ నాయకులు చిలుక రమేష్,, తూమ్ మధు , పీర్ ముహమ్మద్,సాబీర్, అన్నారం శ్రీనివాస్ , పాత సత్యలక్ష్మి, అరుణ్ తేజ చారి, వలి మొహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.






# పోలింగ్ కేంద్రాల్లో.. ఐడీ ఉంటేనే ఎంట్రీ

**హైదరాబాద్ ఆర్వో, జిల్లా కలెక్టర్ అనుదీప్ దూరిశెట్టి**

హైదరాబాద్, మే 11 :పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు, సిబ్బందికి ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా కనీస వసతులు కల్పించాలని హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ అనుదీప్ దూరిశెట్టి సూచించారు. శుక్రవారం హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలోని కార్వాన్, బహదూర్‌పుర అసెంబ్లీ సెగ్మెంట్లలోని పోలింగ్ కేంద్రాలు, నాంపల్లిలోని ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లోని చార్మినార్ డీఆర్‌సీలో ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఓటర్లకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా పోలింగ్ కేంద్రాల్లో వసతులు కల్పించాలన్నారు

చల్లని తాగునీరు, కరెంటు, టాయిలెట్స్, షెడ్స్, షామియానా, ఫర్నిచర్, కూలర్లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల్లోకి గుర్తింపు కార్డు లేని వారిని అనుమతించవద్దని ఆదేశించారు. అంతకు ముందు నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లోని డీఆర్‌సీలో ఉన్న పోస్టల్ బ్యాలెట్, హోం ఓటింగ్ స్ట్రాంగ్ రూములను పరిశీలించారు. హోం ఓటింగ్‌కు సంబంధించిన బ్యాలెట్ బాక్సులను స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరిచి పటిష్ట భద్రత మధ్య ఉంచాలన్నారు. మెటల్ డిటెక్టర్లు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని అనుదీప్ దురిశెట్టి పేర్కొన్నారు. అలాగే పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ రోజున పోలింగ్ కేంద్రంలోకి సెల్‌ఫోన్ తీసుకువెళ్లేందుకు అనుమతి లేదని హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ అనుదీప్ దూరిశెట్టి ఒక ప్రకటనలో తెలిపారు.

# వచ్చే ఏడాది మోదీకి 75 ఏళ్లు, పదవీ విరమణ చేస్తారా..: అరవింద్ కేజ్రీవాల్

న్యూఢిల్లీ, మే 11 : బెయిల్‌పై విడుదలైన ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ బీజేపీ, ప్రధాని మోదీపై విరుచుకుపడ్డారు. వచ్చే ఏడాది మోదీకి 75 ఏళ్లు నిండుతాయని అప్పుడు పదవీ విరమణ చేస్తారా.. బీజేపీ ప్రధానిగా ఎవరు ఉంటారు.. అని ప్రశ్నించారు. శనివారం మీడియా సమావేశంలో అరవింద్ కేజ్రీవాల్ మాట్లాడారు. 'ఇండియా బ్లాక్ ప్రధాన మంత్రి అభ్యర్థి ఎవరని బీజేపీ అడుగుతోంది? అయితే వారి ప్రధాన మంత్రి అభ్యర్థి ఎవరని బీజేపీని నేను అడుగుతున్నా.. అని అన్నారు.కాగా, 2025 సెప్టెంబర్ 17న మోదీకి 75 ఏళ్లు నిండుతాయని కేజ్రీవాల్ తెలిపారు. 75 ఏళ్ల తర్వాత బీజేపీలోని నేతలు రిటైర్ కావాలన్న నిబంధన మోదీ పెట్టారని చెప్పారు. 'లాల్ కృష్ణ అద్వానీ, మురళీ మనోహర్ జోషి, సుమిత్రా మహాజన్, యశ్వంత్ సిన్హా రిటైర్ అయ్యారు. అలాగే వచ్చే ఏడాది సెప్టెంబర్ 17న మోదీ రిటైర్ కాబోతున్నారా.. అని అన్నారు.మరోవైపు కేంద్రంలో బీజేపీ తిరిగి అధికారంలోకి వస్తే తొలుత యోగి ఆదిత్యనాథ్‌ను గద్దె దించుతారని, ఆ తర్వాత అమిత్ షాను దేశానికి ప్రధానిని చేస్తారని కేజ్రీవాల్ తెలిపారు. 'అమిత్ షా కోసం ప్రధాని మోదీ ఓట్లు అడుగుతున్నారు. మోదీ హామీలను అమిత్ షా నెరవేరుస్తారా.. మోదీకి గ్యారెంటీ ఎవరు అందిస్తారు.. మీ హామీలను అమిత్ షా నెరవేరుస్తారా.. అని ప్రశ్నించారు. బీజేపీ ఓటర్లు మోదీకి ఓటు వేయబోరని, అమిత్ షాకు ఓటు వేయబోతున్నారన్నది వారు అర్థం చేసుకోవాలని కేజ్రీవాల్ అన్నారు.

# దేశ భద్రతను దృష్టిలో పెట్టుకొని ఆలోచించి బిజెపికి ఓటు వేయండి

**-మహిళలు పెద్ద ఎత్తున బిజెపి పార్టీలో చేరిక**



మేడ్చల్ మే 11 (ఎక్స్ ప్రెస్ న్యూస్);ఎన్నికల చివరి రోజు బీజేపీ ప్రచారంలో భాగంగా దమ్మాయిగూడ మున్సిపాలిటీలోని ప్రగతి నగర్ కాలని అధ్యక్షులు సంద ముత్తన్న పటేల్ ఆధ్వర్యంలో పలువురు నాయకులు కాలనీవాసులు మహిళలు పెద్ద ఎత్తున బిజెపి పార్టీలో చేరారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మేడ్చల్ రూరల్ జిల్లా బీజేపీ అధికారప్రతినిధి గాలి సంపత్ యాదవ్ హాజరై వారికి పార్టీ కండువా కప్పి పార్టీ లోకి ఆహ్వనించారు. ఈ సందర్భంగా మాట్లాడుతు..మే 13వ తేదీన సోమవారం రోజున పార్లమెంట్ ఎన్నికలలో ఓటు వేసేటప్పుడు ఆలోచించవలసిన ప్రధాన అంశం దేశ భద్రత.కాబట్టి అలోచించి ఓటు వేయాలని అదేవిదంగాదేశాన్ని సురక్షితంగా ఉంచుకోవడం మన అందరి చేతుల్లోనే ఉందనే విషయాన్ని మరవవద్దని.. అదేవిదంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, ల యొక్క శాతాన్ని తగ్గించి రాజ్యాంగానికి వ్యతిరేకంగా..ముస్లిం లకు ఇస్తోంది కాంగ్రెస్ ప్రభుత్వం అనే విషయాన్ని ప్రతీ ఒక్కరు గ్రహించాలని ముస్లింలకు ఇస్తె ఇచ్చేసుకోనీ మనకెందుకు అనుకుంటు న్నాము... .మనకు చెందాల్సిన వాటని మనకు తగ్గించి వాళ్లకు ఇస్తున్నారు. విషయం సరిగ్గా తెలియనిమన తోటి హిందూ బంధువులందరికీ చెప్పండిమన కొరకే బిజెపి ఉన్నది అనేవిషయాన్ని ప్రతీ ఒక్కరికి తెలియజేయాలని కోరుతు. .గత పదేండ్ల మోడీ పాలనకు ఆకర్షితులై మల్కాజిగిరిలో బిజెపి పార్టీ అభ్యర్థి ఈటెల రాజేందర్ గెలుపు కొరకై మేము సైతం అని ముందుకు వచ్చిన వివిధ కాలనీల వాసులందరికీ పేరు పేరునా శుభాకాంక్షలు తెలియజేస్తూ బాజాపాలోకి కండువా కప్పి ఆహ్వానించిడం జరిగింది, ఈ కార్యక్రమంలో 255 బూత్ ప్రెసిడెంట్ తోట నరేష్ పటేల్ 253 254 ప్రెసిడెంట్ మైలారం పద్మావతి , శేఖర్ గౌడ్ గారు, మరియు తదితర నాయకులు కాలనీవాసులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# పోటీ నుంచి తప్పుకుని బీజేపీలో చేరిన అభ్యర్థి..

# 'నోటా'తో గుణపాఠం చెప్పాలని కాంగ్రెస్ పిలుపు

భోపాల్, మే 11 : కాంగ్రెస్ అభ్యర్థి చివరి నిమిషంలో ఆ పార్టీకి షాక్ ఇచ్చారు. నామినేషన్ వేసిన ఆయన పోటీ నుంచి తప్పుకున్నారు. కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి బీజేపీలో చేరారు. దీంతో ఆ పార్టీ తరుపున ఏ అభ్యర్థి పోటీలో లేకుండా పోయారు. ఈ నేపథ్యంలో 'నోటా'తో బీజేపీకి గుణపాఠం చెప్పాలని కాంగ్రెస్ పార్టీ పిలుపుని చ్చింది. మధ్యప్రదేశ్ లోని ఇండోర్ లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థిగా అక్షయ్ కాంతి బామ్ నామినేషన్ దాఖలు చేశారు. అయితే ఉపసంహరణ రోజున అనూహ్యంగా పోటీ నుంచి తప్పుకున్నారు. కాంగ్రెస్ పార్టీని వీడి బీజేపీలో చేరారు.కాగా, ప్రత్యామ్నాయ అభ్యర్థిని పోటీకి దించేందుకు కాంగ్రెస్ పార్టీ హైకోర్టులో పిటిషన్ వేసినప్పటికీ ఫలితం లేక పోయింది. దీంతో ఇండోర్‌లో కాంగ్రె స్ తరుపున అభ్యర్థి లేకుండాపో యా రు. బీజేపీ అభ్యర్థి సిట్టింగ్ ఎంపీ శంకర్ లాల్వానీ, మరో 13 మంది అభ్యర్థులు ఎన్నికల బరిలో నిలిచారు. అయితే వారంతా తమకు పోటీ కాదని బీజేపీ భావిస్తున్నది. మరోవైపు ఇండోర్‌లో పార్టీ అభ్యర్థి పోటీలో లేకుండా మోసం చేసిన బీజేపీకి గుణ పాఠం చెప్పాలని కాంగ్రెస్ పార్టీ నిర్ణయి ంచింది. దీంతో నాలుగో దశలో భాగ ంగా సోమవారం ఇండోర్ స్థానానికి జరిగే పోలింగ్‌లో 'నోటా' గుర్తును నొక్కాలని పార్టీ కార్యకర్తలు, ప్రజలకు పిలుపునిచ్చింది. 'నోటాకు రికార్డు స్థా యిలో ఓటు వేసి బీజేపీకి గుణపాఠం చెప్పండి. ప్రజాస్వామ్యాన్ని కాపాడండి' అని ఆ రాష్ట్ర కాంగ్రెస్ చీఫ్ జితు పట్వారీ, ఇతర నాయకులు ప్రజలను కోరారు. ఈ మేరకు ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

# కేసీఆర్ సభలు సక్సెస్.. బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపు ఖాయం : హరీష్‌రావు



సిద్దిపేట, మే 11 : తెలంగాణ ఉద్యమ రోజుల్లో కేసీఆర్ కు వచ్చిన జన ప్రభంజనం ప్రస్తుతం జరుగుతున్న సార్వత్రిక ఎన్నికల్లోనూ కనిపించిందని మాజీ మంత్రి హరీశ్ రావు పేర్కొన్నారు. సిద్దిపేటలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. దాదాపు అన్ని పార్లమెంట్ నియోజకవర్గాల్లో కేసీఆర్ సభలు విజయవంతం కావడంతో బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపు ఖాయమైందని ధీమాను వ్యక్తం చేశారు.

కాంగ్రెస్, బీజేపీ సభలకు అంత స్పందన లేదని, అమిత్ షా సభకు జనాలు లేక ఏడు నిమిషాల్లో ముగించారని వెల్లడించారు. సరూర్‌నగర్‌లో రాహుల్ సభకు అదే పరిస్థితి ఏర్పడిందని ఆరోపించారు. అధికారంలోకి వచ్చిన అనతికాలంలోనే ప్రజలు కాంగ్రెస్ గ్యారంటీ ల వైఫల్యం పై గరంగరంగా ఉన్నారని, ఎన్నికల్లో కాంగ్రెస్ కు శిక్ష వేయాలని ప్రజలు నిర్ణయానికి వచ్చారని తెలిపారు.

తెలంగాణ కు ఏమి ఇవ్వని బీజేపీకి ఉత్తపుణ్యానికి ఓటేందుకు వేయాలని ప్రజలు భావిస్తున్నారని అన్నారు. కాంగ్రెస్, బీజేపీ అపవిత్ర బంధాన్ని ప్రజలు గుర్తించారని వివరించారు. కేసీఆర్ హయాంలో పుట్ల కొద్ది వడ్లు. కాంగ్రెస్ హయాంలో పుట్టెడు కష్టాలు వచ్చాయని తెలిపారు. బీజేపీ, కాంగ్రెస్ బోగస్ సర్వేల పేరుతో బీఆర్ఎస్ ఆత్మవిశ్వాసాన్ని దెబ్బ తీసే ప్రయత్నం చేశారని మండిపడ్డారు. ఈ రెండు రోజులు బీఆర్ఎస్ కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు.

**కేసీఆర్ గ్యారంటీ యే తెలంగాణకు శ్రీరామ రక్ష**

రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిన కేసీఆర్ తెలంగాణకు శ్రీరామ రక్ష అని హరీష్‌రావు అన్నారు.

కేసీఆర్ ఇచ్చిన నిధులు వెనక్కి తీసుకుని పఠాన్ చెరుకు సీఎం రేవంత్‌రెడ్డి అన్యాయం చేశారని ఆరోపించారు. రిజర్వేషన్లపై గొంతు చించుకుంటున్న రేవంత్ రెడ్డి తన క్యాబినెట్ లో ఎందుకు రిజర్వేషన్ పాటించలేదని ప్రశించారు.

ఎమ్మెల్సీ వెంకట్రామిరెడ్డి స్థానికతను ప్రశ్నిస్తున్?న రేవంత్ రెడ్డి నిజామాబాద్ లో జీవన్ రెడ్డికి, ఎమ్మెల్యే దానం నాగేందర్‌కు ఎంపీ టికెట్ ఎలా ఇచ్చారని నిలదీశారు. రేవంత్ పుణ్యమా అని తెలంగాణలో భూముల ధరలు పడిపోయాయని ఆరోపించారు. మెదక్ బీజేపీ అభ్యర్థి జిమ్మిక్కుల పట్ల అప్రమత్తంగా ఉండాలని బీఆర్ఎస్ శ్రేణులకు పిలుపునిచ్చారు. వెంకట్రామిరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని హరీష్‌రావు కోరారు.

# కాంగ్రెస్ ముదిరాజులను రాజకీయ స్వార్థం కోసమే వాడుకుంది...

### -ముదిరాజుల కోసం కొట్లాడి, అండగా నిలిచిన నాయకుడు బండి సంజయ్...
### -బిజెపి మోడీ ప్రభుత్వం ముదిరాజుల సంక్షేమం అభివృద్ధి కోసం పనిచేస్తుంది...
### -ముదిరాజ్ మహాసభ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గుర్రాల మల్లేశం ముదిరాజ్ , పోలు లక్ష్మణ్ ముదిరాజ్



కరీంనగర్, మే 11: (నేటినిజం ప్రతినిధి) స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం ముదిరాజ్ జాతికి అన్యాయం చేయొద్దని, దశాబ్ద కాలాలు దేశాన్ని రాష్ట్రాన్ని ఏలిన కాంగ్రెస్ ప్రభుత్వాలు ముదిరాజులకు చేసిన మేలేంటో గ్రహించాలని, ముదిరాజులను రాజకీయాల కోసం వాడుకుంటున్న పార్టీలకు జరగబోయే ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని ముదిరాజ్ మహాసభ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గుర్రాల మల్లేశం ముదిరాజ్, మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ఉమ్మడి జిల్లా మాజీ అధ్యక్షులు పోలు లక్ష్మణ్ ముదిరాజ్ అన్నారు. శనివారం కరీంనగర్ లో ముదిరాజ్ మహాసభ ప్రతినిధుల తో కలిసి గుర్రాల మల్లేశం, పోలు లక్ష్మణ్ మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యంగా తెలంగాణ రాష్ట్రంలో వెనుక బడిన తరగతుల జాబితాలో సమగ్ర కుటుంబ సర్వే లెక్కల ప్రకారం 14.2 శాతంతో దాదాపు 55 లక్షల జనాభాను ముదిరాజులు కలిగి ఉన్నారని తెలిపారు. మెజారిటీ ముదిరాజు ప్రజలను లోగోడ కాంగ్రెస్ బీఆంఎస్ ఓటు బ్యాంకుగా ఉపయోగించుకున్నారే తప్ప , ముదిరాజులకు ఎలాంటి న్యాయం చేయలేదన్నారు. ప్రధానంగా ముదిరాజులు రాజకీయంగా అణిచివే యబడ్డారని, 119 శాసనసభ్యులు కలిగిన శాసనసభలో 16 నుండి 20 మంది సభ్యులు, 40 మంది కలిగిన శాసనమండలిలో ఆరుగురికి ఎమ్మెల్సీ, పార్లమెంట్ (లోక్ సభ, రాజ్యసభ) లో పది నుండి 12 మంది సభ్యులు, హైదరాబాద్ మినహా 32 జిల్లా పరిషత్ లో కనీసం నలుగురు జడ్పీ చైర్మన్లు, 594 మండల పరిషత్ చైర్మన్ స్థానాల్లో 83 మందికి, అలాగే జడ్పిటిసి, ఎంపీటీసీ, సర్పంచ్, స్థానాల్లో జనాభా ప్రాతిపది కన ముదిరాజులకు పదవులు రావాల్సి ఉన్న, కాంగ్రెస్ బీఆర్ఎస్ లాంటి రాజకీయ పార్టీలు ముదిరాజ్ వర్గాలకు తీవ్ర అన్యాయం చేశాయన్నారు. 60 ఏళ్లు దేశాన్ని, రాష్ట్రాన్ని ఏలిన కాంగ్రెస్, గత పదేళ్లు రాష్ట్రాన్ని ఏలిన కెసిఆర్ బిఆర్ఎస్ ప్రభుత్వం ఎలాంటి న్యాయం చేసిందో ముదిరాజ్ సమాజం గ్రహించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రధానంగా గతంలో ఉమ్మడి రాష్ట్రంలో అప్పటి కాంగ్రెస్ ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డి ముదిరాజులను బి సి -డి నుండి బీసీ -గ్రూపులోకి మారుస్తూ జీవో వెలువరించిన ప్రభుత్వ ఉత్తర్వులు పూర్తిస్థాయిలో అమలుకు నోచుకోకుండానే నిర్వీర్యమై పోయాయన్నారు. మళ్లీఈ అంశం గురించి కాంగ్రెస్ పార్టీ ఎప్పుడైనా మాట్లాడిందా..? ముదిరాజుల జనాభా ప్రకారం రాజకీయ అవకాశం కల్పిస్తామని మాటిచ్చిందో నిన్నటి రోజున కరీంనగర్లో కాంగ్రెస్ కు మద్దతు తెలిపిన ముదిరాజ్ సంఘ నేతలు జాతికి సమాధానం చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. కరీంనగర్లో పోటీ చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి రాజేందర్ రావుకు ముదిరాజ్ సమస్యల పట్ల ఏమి అవగాహన ఉంది..? ముదిరాజుల కోసం ఆయన ఎప్పుడైనా కొట్లాడాడ మాట్లాడాడ , అండగా నిలిచిందేప్పుడో చెప్పాలన్నారు. ముదిరాజుల వర్గాల జాతికి కరీంనగర్ లో అండగానిలిచిన వ్యక్తి బండి సంజయ్ కుమార్ అని చెప్పారు. గతంలో కరీంనగర్ లోని ఫిష్ మార్కెట్ విషయంలో కొట్లాడి ముదిరాజ్ ప్రజలకు అండగా నిలిచిన నాయకుడు బండి సంజయ్ అన్నారు. బిజెపి మోడీ ప్రభుత్వం గత పదేళ్లుగా ముదిరాజుల సంక్షేమం అభివృద్ధి కోసం పనిచేస్తుందన్నారు.

గత పది ఏళ్ల బిజెపి పాలనలో రాష్ట్రంలోని మత్స్యకారుల అభివృద్ధి సంక్షేమం కోసం అదే చర్యలు అనేక చర్యలు చేపట్టిందన్నారు. అలాగే అధిక శాతం జనాభా కలిగిన ముదిరాజులకు రాజకీయ అవకాశాలను కల్పించిన ఏకైక పార్టీ బిజెపి అన్నారు. మత్స్య సంపద పెంపు కోసం ముదిరాజులకు చేయూతనందించడానికి ఎన్ ఎఫ్ బి డి అధునాతనమైన నూతన పద్ధతుల్లో ఆక్వా కల్చర్ చేపల పెంపకం, కేజ్ కల్చర్, ఆర్నమెంట్ ఫిష్, మొబైల్ ఫిష్టాల్స్, చేపల దానా తయారీ కేంద్రాలు, అలాగే వృత్తి శిక్షణ బోధనలు 80% సబ్సిడీ ద్వారా తెలంగాణ రాష్ట్ర మత్స్య కార్మికులకు బిజెపి ప్రభుత్వం అందించిందన్నారు.

నీలి విప్లవం పథకం ప్రవేశపెట్టి కేంద్ర ప్రభుత్వం 50%, రాష్ట్ర ప్రభుత్వం 50% చేపల హ్యాచరీలు , 50% కేజీ కల్చర్ 80% మినీ దాన ఉత్పత్తి ప్లాంట్లు, 50 శాతం సబ్సిడీ పద్ధతిన తెలంగాణ రాష్ట్ర మత్స్య కార్మికులకు అందించారని వివరించారు. ఐడిఎఫ్ సమీకృత మత్స్య అభివృద్ధి పథకం ద్వారా తెలంగాణ మత్స్య రంగా సమగ్ర అభివృద్ధి కోసం 1000 కోట్ల నిధులను విడుదల చేసిందని, ఇట్టి పథకం ద్వారా రాష్ట్రంలోని 32 జిల్లాల్లోని ప్రాథమిక సహకార సంఘ సభ్యులు, మహిళా సంఘాల సభ్యులు, మార్కెటింగ్ సంఘాల సభ్యులందరికీ వివిధ రకాలుగా లబ్ధి చేకూరిం దన్నారు. బిజెపి మోదీ ప్రభుత్వంలో నిరుపేద మత్స్యకారుల కోసం , ముదిరాజ్ జాతి సమగ్రాభి వృద్ధి కోసం నిరంతరం శ్రమిస్తున్న బిజెపికి ముదిరాజులు ప్రతి ఒక్కరూ అండగా నిలవాల్సిన అవసరం ఉందన్నారు. ఇట్టి సమావేశంలో ముదిరాజ్ మహాసభ ప్రతినిధులు, కరీంనగర్ నగరంలోని వివిధ ప్రాంతాల అధ్యక్షులు కోలకాని నరసయ్య , భాష వేణి భాను ప్రకాష్, నెల్లి శ్రీనివాస్, బడానినరేందర్, అరిగెల రాజయ్య, కంకటి రాజారాం, చొప్పరి అంజయ్య, కుంభం మల్లయ్య, మ్యా కల తిరుపతి, తిప్పరి వేణి లక్ష్మణ్, జరిగే లతిరుపతి, పండుగ బాలు , మండల కనకయ్య, కీర్తి లక్ష్మణ్, బోయిని సంతోష్, జెట్టి బాలయ్య తదితరులు పాల్గొన్నారు

# చివరి రోజు కాంగ్రెస్ ఎన్నికల ప్రచార జోరు

### -కాంగ్రెస్ అభ్యర్థి వెలిచాలను గెలిపించాలని విజ్ఞప్తి




కరీంనగర్, మే 11: (నేటినిజం ప్రతినిధి) పార్లమెంట్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రచారం పీక్ స్టేజ్ కి చేరింది. వెలిచాల రాజేందర్ రావును గెలిపించాలని ముమ్మర ప్రచారం చేస్తున్నారు. ప్రచారం చివరి రోజున రాజేందర్ రావు సోదరి శోభ చింతకుంటలో మహిళలతో కలిసి ప్రచారం నిర్వహించారు. తన తండ్రి స్వర్గీయ వెలిచాల జగపతిరావుకు చింతకుంటతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేశారు. ఈ ప్రాంతానికి తాగునీరు, విద్యుత్ వంటి అనేక సౌకర్యాలు కల్పిచారని చెప్పారు. ఆయన వార సుడు రాజేందర్ రావును గెలిపించాలని కోరారు. గతంలో బీజేపీ, బీఆర్ ఎస్ అభ్యర్థులను ఎంపీలుగా గెలిపిస్తే కరీంనగర్ అభివృద్ధిని గాలికొది లేశారని విమర్శించారు. ఎంతో అన్యోన్యంగా కలిసిమెలిసి జీవిస్తున్న ప్రజల మధ్య కుల, మత విద్వేషాలు రెచ్చగొడుతూ ఓట్లు దండుకోజూ స్తున్నారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలోనే కరీంనగర్ అభివృద్ధి చెందినదని శోభ చెప్పారు. గతంలో ఇందిరమ్మ ఇళ్లు, ఆరోగ్యశ్రీ, రైతులకు ఉచిత కరెంటు వంటి గొప్ప గొప్ప పథకాలు కాంగ్రెస్ ప్రభుత్వమే ఇచ్చిం దని అన్నారు. ఇప్పుడు మహిళలకు ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం, పేదల గృహాలకు ఉచిత కరెంటు వంటి పథకాలు కాంగ్రెస్ ప్రభుత్వమే ఇస్తుందని శోభ చెప్పారు. బీజేపీ, బీఆర్ఎస్ అభ్యర్థులకు ఓట్లు వేసి గెలిపిస్తే ఏనాడు మీ వద్దకు వచ్చి మీ సమస్యలు పట్టించుకోలేదని వివరించారు. ఆరు గ్యారంటీలను అమలు చేస్తూ, ఐదు న్యాయాలతో మీ ముందుకు వచ్చిన కాంగ్రెస్ పార్టీ బలపరిచిన ప్రజా సేవకుడు వెలిచాల రాజేందర్ రావును అత్యధిక మెజార్టీతో గెలిపించాలని శోభ కోరారు.






# ప్రజా సంక్షేమం, దేశాభివృద్ధి , భద్రత బిజెపి తోనే సాధ్యం...

### -కాంగ్రెస్ ఆరు గ్యారంటీ స్కీంల హామీతో ప్రజలను మోసం చేసింది...
### -బండి సంజయ్ కుమార్ పక్క లోకల్ .. జనంలో ఉండే నాయకుడు... కాంగ్రెస్ ,బిఆర్ఎస్ అభ్యర్థులు పొలిటికల్ టూరిస్టులు..
### -కమలం పువ్వు గుర్తుకు ఓటెయ్యండి.. బిజెపి ఎంపీ అభ్యర్థి బండి సంజయ్ కుమార్ ను భారీ మెజారిటీతో గెలిపించండి...
### -ఎన్నికల ప్రచారంలో సెంట్రల్ ఫిలిం సెన్సార్ బోర్డు సభ్యులు, బిజెపి జిల్లా అధికార ప్రతినిధి బొంతల కళ్యాణ్ చంద్ర



కరీంనగర్, మే 11: (నేటినిజం ప్రతినిధి) ప్రజా సంక్షేమం, దేశాభివృద్ధి, భద్రత కేవలం బిజెపితోనే సాధ్యమని, పదేళ్ల మోడీ ప్రభుత్వ పాలన తీరును , 60 ఏళ్ల కాంగ్రెస్ ప్రభుత్వ పాలన తీరును గమనించాలని సెంట్రల్ ఫిలిం సెన్సార్ బోర్డు సభ్యులు , బిజెపి జిల్లా అధికార ప్రతినిధి బొంతల కళ్యాణ్ చంద్ర తెలిపారు. బిజెపి అభ్యర్థి ఎంపీ బండి సంజయ్ కుమార్ ఎన్నికల చివరి రోజు ప్రచారంలో భాగంగా 8వ డివిజన్ అలుగునూర్ పరిధిలో ని పలు ప్రాంతాల్లో స్థానిక బిజెపి శ్రేణితో స్థానిక బిజెపి శ్రేణులతో కలిసి ఆయన విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లో నమూనా యొక్క బ్యాలెట్ తో ప్రజల వద్దకు వెళ్లి బిజెపి గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా బొంతల కళ్యాణ్ చంద్ర మాట్లాడారు. సబ్ కా సాత్,, సబ్ కా వికాస్, సబ్ కా విశ్వాస్, సబ్ కా ప్రయాస్ నినాదంతో బిజెపి ప్రభుత్వం గత పదేళ్లుగా విజయవంతంగాముందుకు సాగుతుందన్నారు. దేశంలోని అన్ని వర్గాల ప్రజల ఆదర అభిమానాలు బిజెపికి ఉన్నాయన్నారు . అందుకే ఫిర్ ఏక్ బార్ మోడీ సర్కార్ దేశంలో రావాలనే బలమైన ఆకాంక్ష ప్రజల్లో తీవ్రంగా ఉందన్నారు. 60 ఏళ్లు దేశాన్ని ఏలిన కాంగ్రెస్ అన్ని రంగాల్లో దేశాన్ని వెనుకకు నెట్టిందని , ప్రజల విశ్వాసాన్ని కూడా కోల్పోయిందన్నారు. తిరిగి ప్రజలను మభ్య పెట్టేందుకు కొత్త ఎత్తుగడలతో ముందుకు వచ్చిందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఆరు గ్యారెంటీ స్కీం ల పేరుతో ప్రజలను మభ్యపెట్టి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందన్నారు. ఆరుగ్యారంటీల్లో ఏ ఒక్క గ్యారెంటీని కూడా సక్రమంగా అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రజలను మోసం చేసిందన్నారు. ఆర్ గ్యారంటీల స్కీం లు సక్రమంగా అమలు కాకపోవడంతో ప్రజల దృష్టిని మరల్చడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రిజర్వేషన్ల రద్దు అంశాన్ని తెరపైకి తెచ్చి గందరగోళం సృష్టించడానికి ప్రయత్నాలు చేశారని తెలిపారు. కాంగ్రెస్ చెప్పేటివి జూట మాటలని ప్రజల కు అర్థమైందన్నారు. అతి తక్కువ సమయంలో ప్రజా వ్యతిరేకత మూటగట్టుకున్న ఏకైక ప్రభుత్వం కాంగ్రెస్ దేనన్నారు. ముఖ్యంగా కరీంనగర్లో బిజెపి ఎంపీ అభ్యర్థి బండి సంజయ్ ని ఎదుర్కోవడానికి కాంగ్రెస్ బిఆర్ఎస్ అభ్యర్థులు ఏకమవుతున్నారని , వారిద్దరూ బండి సంజయ్ కుమార్, బిజెపి లక్ష్యంగానే విమర్శలు చేస్తున్నారన్నారు తప్ప కాంగ్రెస్ బిఆర్ఎస్ అభ్యర్థులు ఒకరికొకరు ఎలాంటి విమర్శలు చేయకపోవడాన్ని ప్రజలంతా గమనించాలన్నారు. బండి సంజయ్ కుమార్ పక్కా లోకల్ , జనంలో ఉండే నాయకుడని, కాంగ్రెస్ , బిఆర్ఎస్ అభ్యర్థులు పొలిటికల్ టూరిస్టు లాంటివారన్నారు. దేశంలో అధికారంలోకి రాని, రాష్ట్రంలో అధికారంలో లేని బి ఆర్ ఎస్ కు ఓటు వేయడం వృధా అనే భావన ప్రజల్లో ఉందన్నారు. ప్రస్తుతం కరీంనగర్ పార్లమెంట్లో పరిధి లో బిఆర్ఎస్ పరిస్థితి అగమ్య గోచరంగా ఉందన్నారు. ఆ పార్టీలోని ప్రజా ప్రతినిధులకు, నాయకులకు కార్యకర్తలకు పార్టీ మనగడ, భవిష్యత్తుపై నమ్మకం లేకుండా పోయిందని , అందుకే ఇతర పార్టీలోకి వలసపోతున్నారన్నీ తెలిపారు. బి ఆర్ ఎస్ పార్టీ చెల్లని నోటు లాంటిదన్నారు. దేశంలో మోడీ ఉండాలి, కరీంనగర్లో బండి సంజయ్ ఉండాలనే బలమైన ఆకాంక్ష పార్లమెంట్ పరిధిలోని అన్ని వర్గాల ప్రజల్లో ఉందన్నారు. ప్రజలంతా కమలం పువ్వు గుర్తుకు ఓటేసి బిజెపి ఎంపీ అభ్యర్థి బండి సంజయ్ కుమార్ ను భారీ మెజార్టీతో గెలిపించాలని ఆయన ఈ సందర్భంగా కోరారు. ప్రచార కార్యక్రమం ముగింపు అనంతరం బిజెపి దేశంలో తిరిగి మూడవసారి అధికారంలోకి రావాలని, కరీంనగర్ పార్లమెంట్ అభ్యర్థి బండి సంజయ్ కుమార్ భారీ మెజార్టీతో గెలవాలని శ్రీ పంచముఖ ఆంజనేయస్వామి, శ్రీ రామ సాయి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇట్టి ప్రచార కార్యక్రమంలో స్థానిక బిజెపి బూత్ అధ్యక్షులు జంగపల్లి వినయ్ , చిందం అంజి, కొత్తూరి శ్రీనివాస్, బండి స్వరాజ్, అనుమట్ల ప్రశాంత్, నూనే గణేష్, వంశీ కృష్ణ, ప్రదీప్ , మధు , సాయిరాం, నాగరాజు , బండి శివతదితరులు పాల్గొన్నారు.

# దక్షిణాదిలో బీజేపీ అద్భుతంగా విజయం సాధించబోతుంది

### -తెలంగాణా రాష్ట్రంలో బిజెపి 10 నుండి 13 సీట్లు గెలుస్తుంది
### -తెలంగాణ ప్రభుత్వం స్టీరింగ్ ఇంకా ఓవైసీ చేతిలోనే ఉంది
### -ప్రధాని మోదీ పై ఒక్క అవినీతి మరక, ఆరోపణలు లేవు
### -కశ్మీర్ ఎప్పటికీ భారత్ లో అంతర్భగమే
### -కేంద్ర హోం మంత్రి అమిత్ షా

హైదరాబాద్ మే 11 (ఎస్ ప్రెస్ న్యూస్);తెలంగాణలో బీజేపీకి మంచి స్పందన ఉందని కేంద్ర హోం మంత్రి అమిత్ షా అన్నారు. రాష్ట్రంలో బిజెపి 10 సీట్లు గెలుస్తుందని చెప్పారు. హైదరాబాద్ లో అమిత్ షా మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడోసారి మోదీ ప్రధాని కావడం ఖాయమని అన్నారు. తెలంగాణ ప్రభుత్వం స్టీరింగ్ ఇంకా ఓవైసీ చేతిలోనే ఉందన్నారు. కాంగ్రెస్ కు తెలంగాణ ఏటిఎంలా మారిందని విమర్శించారు. దక్షిణాదిలో బీజేపీ అద్భుతంగా విజయం సాధించబోతుందని అమిత్ షా ధీమా వ్యక్తం చేశారు.ప్రధాని మోదీ అధికారం చేపట్టిన పదేళ్లలో ఆయనపై ఒక్క అవినీతి మరక, ఆరోపణలు లేవని అమిత్ షా పేర్కొన్నారు. కొంచం ఉద్రిక్తతలు ఎక్కువైనా విదేశాలకు వెళ్లే కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తమకు పోటీనే కాదని షా అన్నారు. సర్జికల్స్ స్ట్రైక్స్ గురించి సిఎం రేవంత్ రెడ్డి తమాషాగా మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సర్జికల్స్ స్ట్రైక్స్ చేసే ధైర్యం కాంగ్రెస్ ప్రభుత్వానికి లేదని, సర్జికల్ స్ట్రైక్స్ ద్వారా పాక్ లో ఉగ్రవాదులను ఏరిపారేశామని అమిత్ షా స్పష్టం చేశారు. పాక్ ఆక్రమిత ప్రాంతం భారత్ ఆదీనంలోనే ఉంటుందని, కశ్మీర్ ఎప్పటికీ భారత్ లో అంతర్భాగాగానే ఉంటుందని, అయోధ్యలో రామమందిరం అంశాన్ని 70 ఏళ్లుగా కాంగ్రెస్ నాన్చుతూ వచ్చిందన్నారు. ఈ సమావేశం లో పార్టీ రాష్ట్ర అధ్యక్షులు కిషన్ రెడ్డి,మల్కాజ్గిరి ఎంపీ అభ్యర్థి ఈటెల రాజేందర్,పార్టీ సీనియర్ నేత లక్ష్మణ్,ఎ న్.వి.సుభాష్,మీడియా ఇంచార్జ్ మౌనిక సుంకర తదితరులు పాల్ గోన్నారు.

# ఆరు నెలల్లో.. కాంగ్రెస్ నేతలు గాడిద గుడ్డు తప్ప ఏమిచ్చారు: హరీశ్ రావు

గజ్వేల్, మే 11 : కాంగ్రెస్ నేతలు ఈ ఆరు నెలల్లో గాడిద గుడ్డు తప్ప ఏమిచ్చారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు విమర్శించారు. బీఆర్ఎస్ హయాంలో సమయానికి రైతుబంధు ఇచ్చామని చెప్పారు. కాంగ్రెస్ పాలనలో మోటర్లు కాలిపోతున్నాయన్నారు. రైతులు, మహిళలు, పేదలందరినీ కాంగ్రెస్ మోసం చేసిందని చెప్పారు. కళ్యాణలక్ష్మి కింద రూ.లక్షతోపాటు తులం బంగారం ఇస్తామన్న హామీ ఏమైందని ప్రశ్నించారు. మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డికి మద్దతుగా గజ్వేల్ పట్టణంలో హరీశ్ రావు రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మహిళలకు బంగారం ఇవ్వడం ఏమోకానీ బంగారం ధరలు కొండెక్కాయన్నారు. కాంగ్రెస్ వచ్చిన తర్వాత కేసీఆర్ కిట్ బంద్ అయ్యిందని విమర్శించారు.

బీజేపీకి ఓటు వేస్తే నీళ్లు లేని బావిలో పడినట్లవుతుందని చెప్పారు. అది పేదల వ్యతిరేక పార్టీ అని విమర్శించారు. గజ్వేల్లో ఏ ముఖం పెట్టుకుని బీజేపీ వాళ్లు ఓట్లు అడుతున్నారని ప్రశ్నించారు. గజ్వేల్ అభివృద్ధిని అడ్డుకున్న వారికి ఎలా ఓట్లు వేస్తారని చెప్పారు. దుబ్బాకలో చెల్లని రూపాయి.. ఇక్కడ చెల్లుతుందా అని ఎద్దేవా చేశారు.

# కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి విజయానికి కృషి చేయాలి

### -ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్..

రాజన్న సిరిసిల్ల, 11 :(నేటినిజం ప్రతినిధి): పార్లమెంట్ ఎన్నికల



సందర్భంగా వేములవాడ నియోజకవర్గం పరిధిలో గత 14 రోజులుగా ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ నియోజకవర్గ పరిధిలోని అన్ని మండల కేంద్రాల్లో, గ్రామాల్లో, వేములవాడ పట్టణంలో కరీంనగర్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వెలిచాల రాజేందర్ రావు కు మద్దతుగా 122 కార్నర్ మీటింగ్ లలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఓటర్లను ఓట్లు అభ్యర్థిస్తూ దేశంలో బిజెపి అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను, రాష్ట్రంలో గత బిఆర్ఎస్ ప్రభుత్వం అవలంబించిన ప్రజా వ్యతిరేక విధానాలు, ప్రజలకు వివరిస్తూ ప్రజలను చైతన్య పరిచారు.

దేశంలో పేద ప్రజలకు సంక్షేమ పథకాలు అందాలన్నా, బావి తరాలు రాజ్యాంగ ఫలాలు అనుభవించాలన్న తమ అమూల్యమైన ఓటును చేతి గుర్తుపై వేసి వెలిచాల రాజేందర్ రావును గెలిపించాలని కోరారు.

# నిరుపేద స్వర్ణకారుడి సర్జరీకి వెస్సో

## 63,400/-ఆర్థిక సహాయం

హైదరాబాద్ మే 11 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);హైదరాబాద్ కుత్బుల్లాపూర్ నివాసి కడియాల ఆనంద్ కుమార్ నిరుపేద స్వర్ణకారులు. అవివాహితుడైన ఆయన, వృత్తిలో సరైన ఆదాయం లేక చిన్న చిన్న కూలి పనులు చేసుకుంటూ వృద్ధాప్యంలో ఉన్న తన తల్లి(85)తో జీవిస్తున్నారు.దురదృష్టవశాత్తు ఎడమ తుంటి కీలుకి టీబీ సోకడంతో ఎముక ఉబ్బి నడవలేని స్థితిలో గత మూడు నెలలుగా మంచానికే పరిమితమయ్యారు. తల్లికి వచ్చే రెండు వేలమందిని పెన్షన్ మరియు బంధు మిత్రుల ఆర్థిక సహాయంతో ఇంటి అద్దె, నిత్యావసరాలు తీర్చుకుంటున్నారు

.హైదరాబాద్, నిమ్స్ ఆసుపత్రి వైద్యులు సర్జరీ చేయడం అవసరం అని అందుకు 2 లక్షల రూపాయల వరకు ఖర్చు అవుతుందని, లక్ష రూపాయలు ఆరోగ్య శ్రీ లో సర్దుబాటు జరుగుతుందని తెలియ చేసారు.ఆనంద్ గారి బంధువు మరియు కుత్బుల్లాపూర్ స్వర్ణకార సంఘ అధ్యక్షులు కడియాల రామాచారి తమ సంఘం తరఫున సుమారు ?25000/- వరకు సహాయం చేసారు. సర్జరీ కొరకు మిగిలిన రూ.75,000/-ల సహాయం కోసం వెస్సోని సంప్రదించారు. వెస్సో గౌరవ దాతల సహకారంతో ఆనంద కుమార్ కు రూ. 63,400/- అందచేసింది. ఈ సందర్భంగా వెస్సో ట్రస్ట్ అధ్యక్షులు బంగారు తాతారావు మాట్లాడుతూవైద్య ఖర్చుల కోసం ఇబ్బంది పడుతున్న ఆనంద్ సహాయం చేసి ఆదుకొన్న గౌరవ దాతలకు హృదయ పూర్వక ధన్యవాదములు తెలిపారు.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas. **RNI No.52865/93.**
E-mail :netinijam93@gmail.com